# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 5-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:29 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

పావన సర్వేక్షణకై
జీవికలకు భద్రత నిల చేపట్టుటకై
కావించు శోధనలకై
ఈవీయస్ విడువ బడిన దిస్రో చేతన్ !!

(సర్వేక్షణ,వ్యవసాయం,విపత్తుల నిర్వహణ వంటి విషయాల్లో శోధనలకు అనుకూలంగా ఉండే విధంగా రూపొందించి ఇస్రో సంస్థ ఈవీయస్ జీరో ఫైవ్ అనే ఉపగ్రహాన్ని ప్రయోగించింది. దీని వలన దేశ ప్రతిష్ట మరింతగా పెరిగింది. ప్రజలకు లాభం కలిగింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

పిండిచేయు కొండనైనా
పరిపాలన యంత్రం
ఎదురొడ్డితే పారబోదు
ఏ రాజీ రణ తంత్రం .
రాజకీయమంటేనే
రంగు హంగు వ్యూహం
పతనమే ప్లాన్ లేక
పెంచుకంటే వ్యామోహం



-వేల్పుల నారాయణ
9440433475

## బిఆర్ఎస్, బీజేపీ నాయకులపై మండిపడ్డ మంత్రి సీతక్క



ములుగు, సెప్టెంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ముశినేపల్లి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. బిఆర్ఎస్, బీజేపీ నాయకులు కావాలని ప్రజా ప్రభుత్వం మీద తప్పుడు ఆరోపణలు చేస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు

గత 10 సంవత్సరాల్లో బిఆర్ఎస్ పార్టీ చేయలేనిది ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులను పచ్చ నాయకులు అని పిచ్చికూతలు కూస్తున్నాడని మీ పక్కన కూర్చున్న నేతలు ఎక్కడినుండి వచ్చారో చూసుకుని మాట్లాడాలని మీ నాన్న కేసీఆర్ రాజకీయ ప్రస్థానం ఎక్కడ మొదలైందో చూసుకోవాలి.

ప్రజా పాలన చేస్తున్న సంక్షేమ పథకాలను కావాలని పోస్టర్లు వేసి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కేసీఆర్ అధికారం వస్తే దళిత ముఖ్యమంత్రిని చేస్తామని లేకుంటే తల నరుక్కుంటామని మాయమాటలు చెప్పి దళితులను మోసం చేసింది మరిచిపోయారా,దళిత పేదలందరికీ 3 ఎకరాల వ్యవసాయ భూమిని ఇస్తామని ఇచ్చార అని ప్రశ్నించారు.

బీజేపీ నాయకులు మాట్లాడుతుంటే వింతగా ఉందని కేంద్రం నుండి ఎందుకు నిధులు చెపియ్యట్లేదు అని అడిగారు.

బిఆర్ఎస్, బీజేపీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలనీ రాజకీయాల్లో హుందాగా నడుచుకుంటే ప్రజలు గౌరవిస్తారని లేదంటే ప్రజల చేతిలో మళ్ళీ గుణపాఠం తప్పదని మంత్రి సీతక్క హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్,బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్,ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ జక్కుల రేవంత్ యాదవ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి,రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు,డైరెక్టర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెట్ల పొదల్లో మహిళ మృతదేహం.. పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్, సెప్టెంబర్ 4: జిల్లాలోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ మృతదేహం కలకలం రేపింది. యమ్నంపేటలోని ఓ యూనివర్సిటీ సమీపంలోని చెట్ల పొదల్లో మృతదేహం లభ్యమైంది. యూనివర్సిటీ సిబ్బంది సమాచారంతో పోచారం ఐటీ కారిడార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. ఘటనా స్థలిలో క్లూస్ టీమ్‌తో ఆధారాల సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఇమృతురాలి వయసు దాదాపు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. దాదాపు వారం రోజుల క్రితమే మృతిచెంది ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అయితే హత్య జరిగిందా.. ఇతర కారణాలతో మృతి చెందిందా.. అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికల అనంతరం మరణానికి అసలు కారణం తేలే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.


## రాష్ట్రాన్ని దోపిడీ చేస్తూ.. ప్రజాపాలన అంటారా..... తలసాని

హైదరాబాద్, సెప్టెంబర్ 4:రాష్ట్రాన్ని దోపిడీ దొంగలు మాదిరిగా దోపిడీ చేస్తూ ప్రజా పాలన అని చెప్పుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు లేదా.. అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం ఆయన జనగాం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచర ణ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు అయినా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజా పాలన అని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు. సమైఖ్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి సహించలేక కేసీఆర్ తన ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. సాధించుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధి లో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు.

రాష్ట్ర ఏర్పాటుకు ముందు నీళ్ళు, విద్యుత్ కోసం ప్రజలు అల్లాడిపోయారని, కానీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక 24గంటల విద్యుత్ సరఫరా, చెరువుల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్ట్ ల నిర్మాణం వలన ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచి దేశానికే అన్నపూర్ణగా మారిందని వివరించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్, నీటి సమస్యలు ఎందుకు వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. పంట పెట్టుబడి కోసం రైతు బందు క్రింద ఆర్థిక సహాయం, ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే రైతు భీమా అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచామని చెప్పారు. అదేవిధంగా పేదింటి ఆడబిడ్డ పెండ్లికి కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ క్రింద లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం అందించామని, జిల్లాకో మెడికల్ కాలేజీని కేసీఆర్ ప్రభుత్వం లో నిర్మించింది వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని, విద్యార్థినీలకు స్కూటీలు, వికలాంగుల పెన్షన్ ను 6 వేల రూపాయల కు పెంచుతామని మేనిఫెస్టో లో ప్రకటించలేదా అని ప్రశ్నించారు.

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలను ఏ విధంగా మోసం చేశారో ప్రజలకు వివరించి దోషులుగా నిలబెడతామని స్పష్టం చేశారు. వెయ్యి రోజులలో బ్రహ్మాండమైన పాలన అందించామని పెద్ద పెద్ద ప్రకటనలు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి, మంత్రులు రాష్ట్రంలో వేడుకలు చేయకుండా ఢిల్లీలో ఏం చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పాలనను గాలికొదిలి ఢిల్లీలో తమ పార్టీ పెద్దలకు ఊడిగం చేయడానికి వెళ్లారని విమర్శించారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు, విమర్శలు చేసుకుంటూ తెలంగాణ పరువును తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నింగిలోకి దూసుకెళ్లిన నాటీ బాయ్.. ఇస్రో జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం సక్సెస్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో చారిత్రక విజయాన్ని అందుకుంది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి శుక్రవారం తెల్లవారుజామున చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతమైంది. ఈ వాహకనౌక ద్వారా 2,367 కిలోల బరువున్న ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి కచ్చితత్వంతో ప్రవేశపెట్టారు. దేశ రక్షణ, విపత్తుల నిర్వహణతో పాటు వ్యవసాయం, పర్యావరణ పర్యవేక్షణ వంటి రంగాల్లో ఈ ఉపగ్రహం కీలక సేవలు అందించనుంది. కాగా, తొలి సంవత్సరాల్లో వరుస అనూహ్య ప్రదర్శనల కారణంగా ఈ రాకెట్ ఇస్రోలో 'నాటీ బాయ్' అనే మారుపేరును సంపాదించుకున్న సంగతి తెలిసిందే.

### కచ్చితత్వంతో కక్ష్యలోకి..

శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17 నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన సుమారు 18 నిమిషాల తర్వాత 3.13 గంటలకు ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ కక్ష్యలో పెరీజీ 170 కిలోమీటర్లు, అపోజీ 28,934 కిలోమీటర్లుగా ఉంది. సుమారు 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల బరువున్న జీఎస్ఎల్వీ-ఎఫ్17 ద్వారా చేపట్టిన జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం.

### భూవీక్షణలో అత్యాధునిక సాంకేతికత

ఈఓఎస్-05 అత్యాధునిక భూ పరిశీలన సామర్థ్యాలతో రూపొందించిన ఉపగ్రహం. ఇందులోని ప్రత్యేక ఇమేజింగ్ పేలోడ్ ద్వారా విస్తృత ప్రాంతాలను అత్యంత స్పష్టతతో చిత్రీకరించవచ్చు. భూస్థిర కక్ష్యలో ఉండే ఈ ఉపగ్రహం భారత ఉపఖండాన్ని తరచుగా పరిశీలించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఒకే ఫ్రేమ్‌లో దక్షిణాసియాలోని విస్తారమైన ప్రాంతాన్ని చిత్రీకరించడంతో పాటు, దాదాపు పది నిమిషాల వ్యవధిలోనే చిత్రాలను అందించగల సామర్థ్యం దీనికి ఉందని ఇస్రో వర్గాలు పేర్కొన్నాయి.

ఈఓఎస్-05లోని ఎంఎక్స్-వీఎన్ఆర్ పేలోడ్ అత్యుత్తమ స్పేషియల్ రిజల్యూషన్‌తో భూ పరిశీలనకు ఉపయోగపడనుంది. జియోసింక్రోనస్ కక్ష్యలో ఇంత అధునాతన ఇమేజింగ్ సామర్థ్యం కలిగిన ఉపగ్రహం భూ పరిశీలన రంగంలో కీలక ముందడుగుగా నిలవనుంది.

### రక్షణ, విపత్తుల నిర్వహణలో కీలకం

సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షించడం, కీలక ప్రాంతాల్లో మార్పులను గుర్తించడం వంటి రక్షణ అవసరాలకు ఉపగ్రహం నుంచి అందే చిత్రాలు ఉపయోగపడనున్నాయి. అదే సమయంలో వరదలు, తుపాన్లు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభావిత ప్రాంతాలను వేగంగా గుర్తించేందుకు ఈఓఎస్-05 డేటా దోహదపడనుంది. సహాయక చర్యలు, రెస్క్యూ ఆపరేషన్లు, అత్యవసర ప్రణాళికలను మరింత సమర్థంగా రూపొందించేందుకు ఇది ఉపయోగపడే అవకాశం ఉంది.పంటల పరిస్థితి, సాగు విస్తీర్ణం, భూమిలో తేమ, నీటి వనరులు వంటి అంశాలను పర్యవేక్షించేందుకు భూ పరిశీలన ఉపగ్రహాల డేటా కీలకం. ఈఓఎస్-05 నుంచి లభించే సమాచారాన్ని వ్యవసాయ ప్రణాళికలు, నీటి నిర్వహణ, పంటల అంచనాల్లో ఉపయోగించవచ్చు. అలాగే అడవుల విస్తీర్ణంలో మార్పులు, పట్టణ ప్రాంతాల విస్తరణ, భూ వినియోగంలో మార్పులు, సహజ వనరుల పరిస్థితిని దీర్ఘకాలంగా పర్యవేక్షించేందుకు కూడా ఈ ఉపగ్రహం దోహదపడనుంది.

### స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కీలక పాత్ర

జీఎస్ఎల్వీ-ఎఫ్17 మూడు దశల ప్రయోగ వాహకనౌక. ఇందులో అత్యంత క్లిష్టమైన స్వదేశీ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ సమర్థంగా పనిచేయడం ప్రయోగ విజయానికి కీలకంగా నిలిచింది. ఉపగ్రహాన్ని తొలుత సబ్-జీటీఓలోకి ప్రవేశపెట్టగా.. అనంతరం ఉపగ్రహంలోని ఆన్‌బోర్డ్ ప్రొపల్షన్ వ్యవస్థ సాయంతో దాన్ని తుది జియోస్టేషనరీ కక్ష్యలోకి చేర్చే ప్రక్రియ కొనసాగనుంది.2021 ఆగస్టులో జీఎస్ఎల్వీ-ఎఫ్10 ద్వారా ప్రయోగించిన జీశాట్-1 ఉపగ్రహం నిర్దేశిత కక్ష్యను చేరుకోలేకపోయింది. ఆ వైఫల్యానికి ప్రత్యామ్నాయంగా మరింత మెరుగైన సాంకేతికతతో రూపొందించిన ఈఓఎస్-05ను ఇప్పుడు విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఇస్రోకు ప్రత్యేక విజయంగా నిలిచింది. గతంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ భారీ ఉపగ్రహాలను అధిక కక్ష్యల్లోకి ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని ఇస్రో మరోసారి చాటుకుంది.

### వర్షంలోనూ ప్రయోగాన్ని వీక్షించిన సందర్శకులు

జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు లాంచ్ వ్యూ గ్యాలరీకి సుమారు 1,500 మంది సందర్శకులు తరలివచ్చారు. తెల్లవారుజామున 2 గంటల నుంచే వర్షం కురుస్తున్నప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. వర్షంలో తడుస్తూనే రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన అద్భుత ఘట్టాన్ని వీక్షించారు.

### అంతరిక్ష రంగంలో భారత్‌కు మరింత బలం

ఈఓఎస్-05 ప్రయోగం కేవలం మరో ఉపగ్రహ ప్రయోగం మాత్రమే కాకుండా భారత భూ పరిశీలన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక మిషన్‌గా నిలిచింది. రక్షణ, విపత్తుల నిర్వహణ నుంచి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ వరకు అనేక రంగాలకు ఉపయోగపడే ఉపగ్రహ డేటాను అందించనుంది. స్వదేశీ రాకెట్లు, క్రయోజెనిక్ సాంకేతికత, అధునాతన ఉపగ్రహ వ్యవస్థలతో అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతికి జీఎస్ఎల్వీ-ఎఫ్17 విజయం మరో నిదర్శనంగా నిలిచింది

## నేను సీఎం కావాలని అనుకుంటున్నా.. ఆ పదవికి గౌరవం ముఖ్యం: కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 4: తెలంగాణ రాజకీయాల్లో తన రాజకీయ లక్ష్యాలపై కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తాను సీఎం కావాలని అనుకుంటున్నానని స్పష్టం చేసిన ఆమె.. ముఖ్యమంత్రి పదవి కేవలం అధికార హోదా కాదని, ఆ పదవికి గౌరవం, హుందాతనం ఎంతో ముఖ్యమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై విమర్శలు చేస్తూ.. ఇకపై 'తుగ్లక్ చర్యలు' అని చెప్పాల్సిన అవసరం లేదని, 'రేవంత్‌రెడ్డిలా ఉన్నావ్' అంటే చాలని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో తన రాజకీయ ప్రత్యర్థులపై కూడా కవిత తీవ్రస్థాయిలో స్పందించారు. దమ్ముంటే హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. తనపై ఎవరో ఒకరు పోటీ చేయడం తప్పదని, అవసరమని భావిస్తే హరీశ్‌రావు రాజకీయాలను పక్కనపెట్టి తన భార్యను రాజకీయాల్లోకి తీసుకురావచ్చని వ్యాఖ్యానించారు.ఇ

తాను గతంలో హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాట వాస్తవమేనని కవిత గుర్తుచేశారు. అయితే.. ఇప్పుడు హరీశ్‌రావు భార్య తనపై పోటీచేస్తే స్వాగతిస్తానని స్పష్టం చేశారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధమే అన్నారు.

## కొండా సురేఖ మాటతీరు మార్చుకోవాలి: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



హైదరాబాద్, సెప్టెంబర్ 4: మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమన్నారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించాల్సిందని అభిప్రాయపడ్డారు. సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడాన్ని ఏఐసీసీ తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. కొండా సురేఖ మాటతీరు మార్చుకోవాలని హితవుపలికారు.

క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే సురేఖపై చర్యలు తీసుకున్నట్లు మహేశ్ వివరించారు. క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే హైకమాండ్ తీసుకుందని వెల్లడించారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మాట్లాడేందుకు పార్టీలో ఎన్నో వేదికలు ఉన్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. భవిష్యత్తులోనూ బీసీలకు పెద్దపీట వేస్తామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.ఇ

## నేపాల్ టన్నెల్స్‌లో రెస్క్యూ ఆపరేషన్స్.. 9 రోజుల తర్వాత ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు సిబ్బంది..



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:నేపాల్‌లో వరదల కారణంగా టన్నెల్స్‌లో చిక్కుకుపోయిన వారికోసం రెస్క్యూ ఆపరేషన్స్ ముమ్మరంగా కొనసాగుతున్నాయి. తాజాగా, రెస్క్యూ సిబ్బంది త్రిశూలీ త్రీఏ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ టన్నెల్ నుంచి ఇద్దరు వ్యక్తులను ప్రాణాలతో బయటకు తీశారు. నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి చెందిన మెకానిల్ ఫోర్‌మ్యాన్ 30 ఏళ్ల షా, త్రిశూలీ త్రీఏ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ 45 ఏళ్ల అమిర్ మహర్జన్‌లను టన్నెల్స్ నుంచి రక్షించారు. వరదల కారణంగా టన్నెల్స్‌లో బురదలో చిక్కుకుపోయిన ఆ ఇద్దరూ 9 రోజుల తర్వాత ప్రాణాలతో బయటపడ్డంతో అధికారుల్లో ఆశలు మొదలయ్యాయి.

నేపాల్ వ్యాప్తంగా 12 హైడ్రోపవర్ ప్రాజెక్ట్స్‌లో పని చేసే 900 మంది వరదల్లో గల్లంతయ్యారు. దాదాపు 500 మంది టన్నెల్స్‌లో చిక్కుకుపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. త్రిశూలీ త్రీఏ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ టన్నెల్ నుంచి ఇద్దరు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డంతో.. మిగిలిన వారు కూడా క్షేమంగా ఉండే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బయటకు వచ్చే సమయానికి ఇద్దరి చేతులు, కాళ్లకు గాయాలు ఉన్నాయని అధికారులు మీడియాకు తెలిపారు. టన్నెల్స్‌లో పాకటం కారణంగా వారికి గాయాలు అయి ఉండొచ్చని అన్నారు. త్రిశూలీ త్రీఏ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ అమిర్ మహర్జన్ సోదరుడు మీడియాతో మాట్లాడుతూ.. 'నాకెంతో సంతోషంగా ఉంది. గాల్లో తేలిపోతున్నట్లుగా ఉంది' అంటూ సంతోషం వ్యక్తం చేశాడు.

## జమ్మూ కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. తీవ్రవాది హతం.. ఏకే రైఫిల్ స్వాధీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: జమ్మూ కాశ్మీర్‌లో శుక్రవారం ఎన్‌కౌంటర్ జరిగింది. బుద్గాం జిల్లాలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. ఈ విషయాన్ని ఇండియన్ ఆర్మీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. దీని ప్రకారం.. ఆపరేషన్ అఫ్జర్ పేరుతో జమ్మూ కాశ్మీర్‌లో తాజా ఆపరేషన్ ప్రారంభమైంది.

జమ్మూ కాశ్మీర్‌లోని, బుద్గాం జిల్లా, అఫ్జర్ గాలి ప్రాంతంలో ఉగ్రవాదులున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం అందింది. దీంతో అనుమానాస్పద ప్రాంతాల్లో ఇండియన్ ఆర్మీ, జమ్మూ కాశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు కలిసి సంయుక్తంగా శుక్రవారం సోదాలు ప్రారంభించారు. ఆపరేషన్ అఫ్జర్ పేరుతో తనిఖీ, భద్రతా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించారు.దీంతో భారత భద్రతా బలగాలు కూడా వారిపై ఎదురు కాల్పులకు దిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. అతడి వద్ద నుంచి ఏకే రైఫిల్, కొన్ని ఆయుధాల్ని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఉగ్రవాదుల కోసం ఇంకా గాలింపు కొనసాగుతోందని సైన్యం వివరించింది. ఉన్నతాధికారులు పరిస్తితిని సమీక్షిస్తున్నారు.

## కాంగ్రెస్‌లో ఎక్కడా వర్గ పోరు లేదు: మంత్రి వివేక్ వెంకటస్వామి

మంచిర్యాల, సెప్టెంబర్ 4,ఇ: కాంగ్రెస్‌లో ఎక్కడా వర్గ పోరు లేదని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి ఇ వ్యాఖ్యానించారు. నేతలు అందరం కాంగ్రెస్ బలోపేతం కోసమే పని చేస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు (శుక్రవారం) మంచిర్యాలలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వేయి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేసిందని తెలిపారు.

ఇరాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేక పోయిన తాము ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. 22ఏ భూముల సమస్య గత బీఆర్ఎస్ ప్రభుత్వ పుణ్యమేనని, ఆ జీవోను పున:పరిశీలన చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే పరిష్కరిస్తామని మాటిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో ఏం జరిగిందో ప్రజలందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ ఎందుకు కుగిందనే విషయంపై హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయులు అందరూ గురువులుగా ఎదగాలి

## (05 సెప్టెంబర్ "జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం" సందర్భంగా)

ఒక సామాన్య మానవున్ని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చగల ధీర మేధావి గురువు. తొలి అక్షరం దిద్దించడం, వ్యక్తిత్వ వక్రగుణాలను సవరిస్తూ, సన్మార్గాలను చూపుతూ, అత్యున్నత స్థాయికి ఎదిగే వరకు మన వెంట నిడిచి, వెన్నెముకలా నిలిచి, నిరాశలో ఆశల విత్తులు నాటుతూ, కొవ్వత్తిలా తను కరిగిపోతూ రేపటి తరానికి దారి దీపంగా నిలుస్తూ, తడబడినపుడు ఊత కర్రగా మారగల మహోన్నత దైవ రూపం, నడిచే ఆదర్శాల నిధి గురువు మాత్రమే. పాఠ్యాంశాలను బోధిస్తూ, వెన్నుతట్టి నడక, నడతల్ని నేర్పుతూ, జ్ఞానోదయాన్ని కలిగించగల నిస్వార్థ జీవి ఉపాధ్యాయుడు. ఢిల్లీకి రాజైన సద్గురువుకు పాదాభివందనం చేసేది భాద్యతగల శిష్యుడే. పెరిగే మొక్కకు ఊత కర్ర ఉపాధ్యాయుడు. భగవంతుడితో భక్తుడి సంబంధం లాంటిదే గురు శిష్యుల పరమ పవిత్ర సంబంధం. గురువులు సృష్టి కర్త వంటి వారు. విద్యార్థికి జ్ఞానాన్ని అందించి, కొత్త విషయాలను నేర్పించే పాత్రను పోషిస్తారు. గురువు మార్గ నిర్దేశనం చేస్తూ, మోక్షం వైపు నడిపిస్తారు. గురువు పరంధాముడు, అజ్ఞాన చీకట్లను చిదివేసి జ్ఞానోదయం కలిగించే వారు. గురువు పరివర్తకుడు, భవిష్యత్తు తీర్చిదిద్దే మేధావి.

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం – 2026:

ఉపాధ్యాయుడు రేపటి తరం నిర్మాతలు. తరగతి గదుల్లోనే జాతి నిర్మాణం జరుగుతుంది. గురువులను నమ్మిన శిష్యుడికి ఎదురు ఉండదు. గురువు ప్రాధాన్యాన్ని గుర్తించిన డా: సర్వేపల్లి రాధాకృష్ణన్ సూచన మేరకు తన పుట్టిన రోజును భారతదేశ "జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం (నేషనల్ టీచర్స్ డే)"గా పాటించడం 1992 నుంచి ఆనవాయితీగా మారింది. విజ్ఞానం, లోక జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, వివేకం, విద్యాబుద్ధులు, శాస్త్రీయ దృక్పథం, మంచి అలవాట్లు, ప్రేరణ కల్పించడం, పొరపాట్లను నిర్దయగా సవరించడం, కెరీర్ నిర్మించడం లాంటి బహుముఖీల లక్ష్యాలను మదిలో నింపుకొని తమ విధులను సక్రమంగా, పవిత్రంగా నిర్వహించే గురువులు శిష్యుల దృష్టిలో బ్రహ్మ సమానులే. పుస్తకాల్లో పాఠాలను మాత్రమే బోధించే వారు సాధారణ ఉపాధ్యాయులు. పాఠ్యాంశాలతో పాటు హృదయపూర్వకంగా విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే మహానుభావులు మాత్రమే సద్గురువులు. పిల్లల్లో దయ, కరుణ, ఉత్సుకత, ధైర్యం, ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ అనబడే విత్తులు నాటి నీడనిచ్చే మహా వృక్షాలుగా మార్చగల మహోన్నతులు సద్గురువులు. ఓపిక, బేషరతు త్యాగాల ప్రతిరూపం ఉపాధ్యాయులు.

గురువు, ఉపాధ్యాయుడు ఒకటేనా?!

గురువు, ఉపాధ్యాయుడు అనేవి పర్యాయ పదాలు కావు. వాటి అర్థాలు వేరు వేరుగా ఉన్నాయి. ఉపాధ్యాయుడు కేవలం విద్యను, పాఠ్యాంశాలను బోధిస్తే, గురువు అజ్ఞాన చీకట్లను తొలగించి వెలుగుల వైపుకు జీవితాలను తీర్చిదిద్దుతాడు. ఉపాధ్యాయ అనగా 'ఉప-అధ్యాయః' అని అర్థం. 'ఉప' అనగా 'దగ్గరగా' అని, 'అధ్యాయ' అనగా 'బోధన చేయడం' అని అర్థం చేసుకోవాలి. పుస్తకాల్లో నిర్ధేశించబడిన సెలబస్‌ను బోధించి, పరీక్షలకు తయారు చేస్తారు. తరగతి గదికి పరిమితమై నిర్దిష్ట సమయాల్లో పాఠాల చదువులను బోధిస్తాడు ఉపాధ్యాయుడు. విద్య బోధించి మార్కులు తెప్పించడం ఉపాధ్యాయుడి బాధ్యత. సంస్కృతంలో 'గు' అనగా చీకటి లేదా అజ్ఞానం అని, 'రు' అనగా 'తొలగించే కాంతి పుంజం' అని అర్థం. గురువు జ్ఞానంతో పాటు నైతిక విలువలు, సంస్కారం, ఆధ్యాత్మిక ఉన్నతి, జీవిత సత్యాలను బోధిస్తాడు. శిష్యుడి వ్యక్తిత్వ వికాసానికి పునాదులు వేస్తూ, అజ్ఞానాన్ని పారద్రోలా, మనిషిని ఉత్తమ వ్యక్తిగా తీర్చిదిద్దుతాడు. దీనిని బట్టి ఉపాధ్యాయుడు అందరూ గురువులు కారని తెలుస్తున్నది. గురువులు అందరూ ఉపాధ్యాయులు అయితే ఉపాధ్యాయులు అందరూ గురువులు కాలేరు.

గురువులకే గురువు డా: సర్వేపల్లి రాధాకృష్ణన్ (1988 – 1975):

05 సెప్టెంబర్ 1888 రోజున తిరుత్తని, తమిళనాడుకు చెందిన మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన రాధాకృష్ణన్, చిన్నతనం నుంచే అత్యుత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు. పాఠశాల విద్య అనంతరం మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో ఉన్నత విద్య పూర్తి చేశారు. అనంతరం మైసూర్ యూనివర్సిటీ, కలకత్తా యూనివర్సిటీల్లో అధ్యాపకుడిగా సేవలు అందించిన పిదప ఆంధ్ర, ఢిల్లీ, బెనారస్ హిందూ యూనివర్సిటీలకు విసిగా సేవలు అందించారు. ఆక్సఫర్డ్, చికాగో యూనివర్సిటీలతో పాటు యునెస్కో బోర్డులో తన సత్తా చాటారు. డా: రాధాకృష్ణన్ అద్వితీయ మేధో సంపత్తిని గుర్తించిన భారత ప్రభుత్వం 1952లో భారత ఉపరాష్ట్రపతిగా ఎంపిక చేసుకోవడం జరిగింది. అదే క్రమంలో 1954లో దేశ రెండవ రాష్ట్రపతిగా 1967 వరకు విశేష సేవలు అందించారు. యునెస్కో చొరవతో 05 అక్టోబర్‌న ప్రతి ఏట "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం" జరుపుకోవడం కూడా కొనసాగుతున్నది. 1954లో భారత రత్న స్వీకరించిన రాధాకృష్ణన్, 16 పర్యాయాలు నోబెల్ సాహిత్య బహుమతికి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. ఫిలాసఫీలో లోతైన పరిజ్ఞానం కలిగిన రాధాకృష్ణన్, తన జీవితకాలంలో పలు ప్రఖ్యాత పుస్తకాలు రచించారు.

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు:

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేదికగా మన గురువులకు కృతజ్ఞతలు తెలపడం, వారి దీవెనలు పొందడం, వారిని మనస్ఫూర్తిగా సన్మానించడం, సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రేమపూర్వకంగా ఉత్తరాలు రాయడం, విద్యాలయాల్లో సెల్ఫ్ గవర్నమెంటు డే పాటించడం, వారి సేవలను కొనియాడడం, విద్యాలయాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. నిస్వార్థ ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను తెలుపడానికి ఈ వేదిక ఎంతగానో ఉపకరిస్తుందని గమనించాలి. కంచే చేనును మెసినట్లు, నేటి ఉపాధ్యాయుల్లో కొందరు విధులను నిర్లక్ష్యం చేయడం, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం, విధి నిర్వహణలో ఆల్కహాల్ సేవించడం, కాలక్షేపం కోసం ఉద్యోగం చేయడం, అభ్యంతరకరంగా ప్రవర్తించడం అత్యంత విచారకరం.

రేపటి తరం నిర్మాతలుగా నేటి ఉపాధ్యాయులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి డిజిటల్-ఏఐ తరగతి గదుల్లో సాంప్రదాయంతో బోధనలు చేయడానికి ముందుకు రావాలని, ప్రతి విద్యార్థిని బాధ్యతగల పౌరులుగా మార్చడానికి కృషి చేయాలని కోరుకుందాం.

గురుః బ్రహ్మ గురుః విష్ణు గురు దేవో మహేశ్వరః
గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః



-మధుపాళీ
9949700037

# వామపక్ష తీవ్రవాద భయం నుంచి శాంతి, ప్రగతి, అవకాశాల వైపు ఛత్తీస్‌గఢ్ ప్రయాణానికి ప్రతీకగా నిలుస్తోన్న ఎయిమ్స్ రాయ్‌పూర్: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:రాయ్‌పూర్‌లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) మూడో స్నాతకోత్సవ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ నేడు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన విద్యార్థులు దేశ ప్రజల ఆరోగ్యం, విశ్వాసం, ప్రాణాలను కాపాడే బాధ్యతను భుజాన వేసుకోవాలని పిలుపునిచ్చారు.

సభను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... స్నాతకోత్సవం కేవలం వేడుకల సందర్భం మాత్రమే కాదని, బాధ్యతను గుర్తు చేసే క్షణం కూడా అని అన్నారు. "ఈ రోజు మీరు డిగ్రీలు అందుకుంటున్నారు. రేపు మీకు దేశ ప్రజల ఆరోగ్యం, విశ్వాసం, వారి జీవితాలు వంటి విలువైన బాధ్యతను మీకు అప్పగిస్తారు" అని ఆయన పేర్కొన్నారు.

2012లో స్థాపించినప్పటి నుంచి ఎయిమ్స్ రాయ్‌పూర్, మధ్య దేశంలో వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధన రంగాల్లో ప్రాంతీయ అసమానతలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తోందని ఉపరాష్ట్రపతి తెలిపారు. అతి తక్కువ సమయంలోనే ఈ సంస్థ ఛత్తీస్‌గఢ్‌తో పాటు పొరుగు రాష్ట్రాలకు, ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించే ప్రముఖ తృతీయ స్థాయి వైద్య సంస్థగా అభివృద్ధి చెందిందని అన్నారు.

ఎయిమ్స్ రాయ్‌పూర్ అభివృద్ధి ఛత్తీస్‌గఢ్‌లో చోటు చేసుకుంటున్న గణనీయమైన మార్పుకు ప్రతిబింబమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

దశాబ్దాలుగా ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాలు అనేక సవాళ్లను ఎదుర్కొన్నాయని శ్రీ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, తగిన రవాణా సౌకర్యాలు లేకపోవడం, వామపక్ష తీవ్రవాదం అభివృద్ధికి తీవ్ర అవరోధాలుగా మారాయని తెలిపారు. మారుమూల, గిరిజన ప్రాంతాల్లో భయం, హింస కారణంగా రహదారులు, పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధి దెబ్బతిన్నదని, ఫలితంగా ప్రజలు అత్యవసర సేవలను పొందేందుకు దూరం, కొరత వంటి సమస్యలను ఎదుర్కొన్నారని వివరించారు.

గతంలోని చీకటి పరిస్థితుల నుంచి బయటపడి, ప్రస్తుతం సుసంపన్నత, అభివృద్ధి, ప్రగతితో కూడిన కొత్త శకాన్ని ఛత్తీస్‌గఢ్ చూస్తోందని ఉపరాష్ట్రపతి అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని నిర్ణయాత్మక విధానం, కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా వ్యూహాత్మక సంకల్పం, ముఖ్యమంత్రి శ్రీ విష్ణుదేవ్ సాయి నిబద్ధతతో కూడిన నాయకత్వం ఈ మార్పునకు కారణమని ఆయన పేర్కొన్నారు.

దశాబ్దాలుగా కొనసాగిన నక్సలిజం సమస్యకు ముగింపు పలికారని, ఒకప్పుడు హింసకు మారుపేరుగా ఉన్న ప్రాంతాలు ఇప్పుడు రహదారులు, పాఠశాలలు, ఆసుపత్రులు, మెరుగైన రవాణా అనుసంధానం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కేంద్రాలుగా గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు.

"దృఢమైన రాజకీయ సంకల్పం, పటిష్టమైన భద్రతా విధానం, అభివృద్ధి ఆధారిత పాలనతో ఎలాంటి మార్పు తీసుకురావచ్చో ఈ పరిణామం స్పష్టమైన ఉదాహరణ" అని ఉపరాష్ట్రపతి అన్నారు.

భయం, వెనుకబాటుతనం ఉన్న కాలం నుంచి శాంతి, ప్రగతి, అవకాశాలతో కూడిన కొత్త శకంలోకి అడుగుపెడుతున్న ఛత్తీస్‌గఢ్‌కు ఎయిమ్స్ రాయ్‌పూర్ ఒక అద్భుతమైన ప్రతీకగా నిలుస్తోందని ఉపరాష్ట్రపతి అభివర్ణించారు.

అధునాతన వైద్య సేవలు, అవయవ మార్పిడి రంగాల్లో ఎయిమ్స్ రాయ్‌పూర్ సాధించిన విజయాలను ఆయన ప్రశంసించారు. ఛత్తీస్‌గఢ్‌లో తొలిసారిగా చేపట్టిన కిడ్నీ మార్పిడి, కిడ్నీ మార్పిడి చికిత్సల్లో 95 శాతానికి పైగా విజయవంతమైన ఫలితాలు, మూత్రపిండాలు, కార్నియా మార్పిడులు, చెవి ఇంప్లాంట్లు వంటి విజయాలు ఈ ప్రాంతంలో ఆధునిక వైద్యం వేగంగా అందుబాటులోకి వస్తోందనడానికి నిదర్శనమని తెలిపారు. గుండె మార్పిడి కార్యక్రమానికి అనుమతి లభించడం మరో కీలక విజయంగా ఆయన పేర్కొన్నారు.

'వికసిత్ భారత్' జాతీయ దార్శనికతను సాధించేందుకు సమతుల్య అభివృద్ధి ఎంతో ముఖ్యమని ఉపరాష్ట్రపతి అన్నారు. ప్రతి రాష్ట్రం, జిల్లా, గ్రామం అభివృద్ధి చెందినప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాకారమవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఉన్నత విద్యకు అందరికీ అవకాశం కల్పించడం 'వికసిత్ భారత్' లక్ష్యంలో కీలకమని తెలిపారు. గత 12 ఏళ్లలో దేశంలో ఉన్నత విద్య విస్తరణ గణనీయంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఉన్నత విద్యలో మహిళల భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరిగిందని ఉపరాష్ట్రపతి తెలిపారు. 2014-15లో 1.57 కోట్లుగా ఉన్న మహిళా విద్యార్థుల నమోదు 2023-24 నాటికి 2.24 కోట్లకు పెరిగిందని, ఇది 42.2 శాతం వృద్ధిని సూచిస్తుందని వివరించారు. ఎయిమ్స్ రాయ్‌పూర్ స్నాతకోత్సవంలోనూ 376 మంది మహిళలు, 313 మంది పురుషులు డిగ్రీలు అందుకుంటున్నారని ఆయన తెలిపారు.

పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి శ్రీ సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ... యువ గ్రాడ్యుయేట్లు ఎల్లప్పుడూ "మాదకద్రవ్యాలు వద్దు" అని స్పష్టంగా చెప్పాలని పిలుపునిచ్చారు. సాంకేతికత దేశంలోని చివరి పౌరుడికి కూడా చేరేలా, ప్రతి యువ భారతీయుడు మెరుగైన భవిష్యత్తును ఆశించేలా భారత్‌ను నిర్మించడంలో వారు భాగస్వాములు కావాలని కోరారు.

"మీ జ్ఞానం ప్రజలకు స్వస్థతను చేకూర్చాలి, మీ పరిశోధనలు నూతన ఆవిష్కరణలకు దోహదపడాలి, మీ సేవ ఇతరులకు స్ఫూర్తినివ్వాలి" అని ఉపరాష్ట్రపతి ఆకాంక్షించారు.

వైద్య సేవల్లో అత్యుత్తమ ప్రమాణాలు, శాస్త్రీయ ఆవిష్కరణలు, ప్రజారోగ్యం, మానవీయ సేవల రంగాల్లో ఎయిమ్స్ రాయ్‌పూర్ మరింత విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న అభివృద్ధి మార్పు, 'వికసిత్ భారత్ 2047' వైపు దేశం సాగుతున్న సుదీర్ఘ ప్రయాణంలో ఒక కీలక అధ్యాయంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపరాష్ట్రపతి బంగారు పతకాలు, ధ్రువపత్రాలను ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ గవర్నర్ శ్రీ రామెన్ దేకా, కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్, ఛత్తీస్‌గఢ్ వైద్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యాశాఖ మంత్రి శ్రీ శ్యామ్ బిహారీ జైస్వాల్, రాయ్‌పూర్ ఎంపీ శ్రీ బృజ్‌మోహన్ అగర్వాల్, ఎయిమ్స్ రాయ్‌పూర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ (డాక్టర్) సంజీవ్ హండా, ఎయిమ్స్ రాయ్‌పూర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ అశోక్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సంపత్

కరీంనగర్, సెప్టెంబర్ 4 పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తెనుగువాడకు చెందిన సీనియర్ నాయకుడు బూతగడ్డ సంపత్ నియమితులయ్యారు. అలాగే మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా మూలసాల గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కట్కూరి సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీకి, ఎమ్మెల్యే విజయరమణారావుకు విధేయతతో అంకితభావంతో పనిచేస్తున్నందుకు ఇరువురికి సముచిత స్థానం దక్కిందని పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సంపత్, సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణారావు ఆదేశాల మేరకు పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని సంపత్, సుధాకర్‌రెడ్డి తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.

# అధ్యక్ష పదవికి అర్హులైన వారి పేర్లు పంపాలి

### ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల నియామకంపై పరిశీలన
### డీసీసీ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన పరిశీలకుడు విశ్వనాథరావు



ఆదిలాబాద్, సెప్టెంబర్ 4:ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల పేర్లను పార్టీ అధిష్ఠానానికి పంపించాలని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎన్నికల పరిశీలకుడు, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథరావు కోరారు. గురువారం పెద్దపల్లిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్‌లో ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడి నియామక ప్రక్రియపై చర్చించారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలో ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టినట్లు విశ్వనాథరావు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుని అర్హులైన వారి పేర్లను అధిష్ఠానానికి పంపనున్నట్లు చెప్పారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఆదివాసీ వర్గాలకు పార్టీ వ్యవస్థలో సముచిత ప్రాతినిధ్యం కల్పించడమే నియామక ప్రక్రియ ఉద్దేశమని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి నియామక ప్రక్రియపై డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌తో చర్చించినట్లు విశ్వనాథరావు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతం చేయడం, ఆదివాసీ వర్గాలను కాంగ్రెస్‌కు మరింత చేరువ చేయడం వంటి అంశాలపై అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంగిడి సర్పంచ్ ఆత్రం మీరా జాలీంషా, ధనోర సర్పంచ్ మెస్రం స్పందన భూపతి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లింగాపూర్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు




ఆదిలాబాద్, సెప్టెంబర్ 4: కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ప్రజ్ఞ అప్పర్ ప్రైమరీ స్కూల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గోవింద నామస్మరణతో ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల సందడితో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భాజగోని రంజిత్‌గౌడ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు చేసిన సందడి అందరినీ ఆకట్టుకుంది.

# జల సమస్యలపై ప్రజా ప్రతినిధులు.. అధికారులు..

## రైతుల భాగస్వామ్యంతో ప్రగతిశీల అంతర్రాష్ట్ర అధ్యయన పర్యటనలకు పిలుపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:జల భద్రతపై కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ఇవాళ ముగిసిన నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య మరింత సన్నిహిత సహకారం ద్వారా 'టీమ్ ఇండియా' స్ఫూర్తిని బలోపేతం, సహకారాత్మక సమాఖ్యవాదాన్ని ప్రోదిచేయడం, జాతీయ ప్రాధాన్యాలపై సామూహిక విధివిధానాలను ప్రోత్సహించే దిశగా ప్రధానమంత్రి సంకల్పించిన శాఖాపరమైన శిఖరాగ్ర సమావేశాల పరంపరలో ఇది మొదటిది కావడం గమనార్హం. జాతీయ జల భద్రతకు సంబంధించి వివిధ కోణాల్లో కేంద్రీకృత చర్చల దిశగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మంత్రులతోపాటు సీనియర్ అధికారులను ఈ సమావేశం ఒకే వేదికపైకి తెచ్చింది.

ఇందులో భాగంగా రెండు రోజులపాటు సాగిన ఈ విస్తృత చర్చలను ప్రధానమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా తీర్మానించిన ఆచరణీయ, వ్యవధి నిర్దేశిత కార్యాచరణపై నిరంతర సమీక్షతోపాటు అధ్యయన ప్రక్రియను కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ శిఖరాగ్ర సమావేశం కేవలం ఒక్కసారితో ముగిసేదిగా మిగలరాదని, నిరంతర సమీక్షలు, తదుపరి చర్యల ప్రక్రియ కొనసాగాలని ఆయన పిలుపునిచ్చారు.

పట్టణీకరణతో జనాభా పెరుగుదల, భవిష్యత్ నీటి అవసరాలు సహా తలెత్తే వివిధ సవాళ్లపై పట్టణ స్థానిక సంస్థలకు అవగాహన కల్పించాలని కోరారు. ఆ మేరకు ఆయా సంస్థల పరిధిలోనూ ఇలాంటి మేధామథన శిబిరాలను నిర్వహించాలని సూచించారు. నీటిని పొదుపు చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా అనుసరించాలని ఆయన కోరారు. భారత తయారీదారులు, భాగస్వాములు, సమర్థ పరిష్కారాల రూపకల్పన సహా వాటి విస్తరణకు వీలుగా ప్రపంచ ఉత్తమ పద్ధతులపై అవగాహనతో కూడిన ప్రత్యేక ప్రదర్శనలు, కార్యశాలలను నిర్వహించాలని కూడా ఆయన సూచించారు.

ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యమిస్తూ- ప్రజలలో మరింత అవగాహన దిశగా "జల ఉత్సవాల" నిర్వహణను ప్రోత్సహించాలని ప్రధానమంత్రి సూచించారు. పూడికతీతను ఒక సాధారణ కార్యక్రమంగా మార్చాలని, తదనుగుణ స్పష్టమైన ప్రమాణాలను, ప్రామాణిక కార్యాచరణ విధానాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. డ్యాముల భద్రత, ప్రతి రుతుపవనానికీ ముందు పటిష్ట సన్నద్ధత, సూచించిన జాగ్రత్తల అనుసరణ వగైరాలను విద్యా ప్రణాళికలలో తగిన విధంగా చేర్చడం సహా పాఠశాల విద్యార్థులలో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు.

విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలలో జల నిర్వహణ, యాజమాన్యంపై పరిజ్ఞానాన్ని, సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. ఆచరణాత్మక అభ్యసన సౌలభ్యం దిశగానూ, విజయవంతమైన చర్యల పునరావృతం నిమిత్తం ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులతో ప్రగతిశీల అంతర్రాష్ట్ర అధ్యయన పర్యటనలు చేపట్టాలని ఆయన సూచించారు.

# విద్యతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

## ప్రభుత్వ బాలికల పాఠశాలలో సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం ప్రారంభం

## విద్యార్థినులు ప్రయోగాత్మక పరిజ్ఞానంతో రాణించాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కరీంనగర్, సెప్టెంబర్ 4విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రయోగాత్మక, శాస్త్రీయ పరిజ్ఞానం అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

ఈ సందర్భంగా సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించిన ఆది శ్రీనివాస్.. విద్యార్థినులకు అందుతున్న ప్రయోగాత్మక శిక్షణ, ల్యాబ్‌లోని సౌకర్యాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగాల ద్వారా అర్థం చేసుకోవడానికి సైన్స్ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేయడం ద్వారా విషయాలను సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు వాటిపై ఆసక్తి పెంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని ఆది శ్రీనివాస్ సూచించారు. శాస్త్రీయ దృక్పథం వల్ల సృజనాత్మకత, పరిశీలనా శక్తి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యార్థినులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండి ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించే అలవాటు పెంచుకోవాలని సూచించారు. చదువుతో పాటు కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తిని పెంపొందించుకోవాలని అన్నారు.

నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం విద్యార్థినుల్లో పఠనాసక్తిని పెంచడంతో పాటు సాధారణ జ్ఞానం, భాషా పరిజ్ఞానం, పోటీ పరీక్షలకు అవసరమైన అవగాహన పెంచేందుకు దోహదపడుతుందని ఆది శ్రీనివాస్ తెలిపారు. పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదివే అలవాటును విద్యార్థినులు పెంపొందించుకోవాలని సూచించారు. రోజువారీగా కొంత సమయం పుస్తక పఠనానికి కేటాయించడం ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవచ్చని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆది శ్రీనివాస్ తెలిపారు. విద్యారంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలను దశలవారీగా కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

అందుబాటులోకి వచ్చిన సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ప్రభుత్వ విప్ ఆకాంక్షించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధితో పాటు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకారం నిరంతరం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన సమావేశమైన ఉన్నత స్థాయి కమిటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన విమాన లీజింగ్, ఫైనాన్సింగ్‌పై ఉన్నత స్థాయి కమిటీ (హెచ్ఎల్‌సీ) మొదటి సమావేశం జరిగింది. దేశ విమానయాన రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో... దేశంలో పటిష్ఠమైన, ప్రపంచంతో పోటీపడగల విమాన లీజింగ్, ఫైనాన్సింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలను ఈ కమిటీ చర్చించింది.

ఈ సమావేశానికి పౌర విమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ సిన్హా, పౌర విమానయాన మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి శ్రీ పునీత్ కన్సల్ సహా పౌర విమానయాన మంత్రిత్వశాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖ, వాణిజ్య విభాగం, డీజీసీఏ, ఆర్‌బీఐ, ఐఎఫ్ఎస్‌సీఏలకు చెందిన ఉన్నతాధికారులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

"గత సంవత్సరం, మేం గిఫ్ట్ సిటీలో మొదటి ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ సమ్మిట్ నిర్వహించాం. కేప్‌టౌన్ కన్వెన్షన్‌ను ఆమోదించడం ఆ సమావేశంలో భాగస్వాముల నుంచి వచ్చిన కీలక సూచనల్లో ఒకటి. మేం 'ప్రొటెక్షన్ ఆఫ్ ఇంటరెస్ట్స్ ఇన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆబ్జెక్ట్స్ యాక్ట్'ను రూపొందించడం ద్వారా దానిని పరిష్కరించాం. ఈ సంవత్సరం, రెండో ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ సమ్మిట్ సందర్భంగా పరిశ్రమ నుంచి అందిన సూచనల్లో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం ఒకటి. ఈ రోజు ఆ కమిటీ ఏర్పాటు చేసి, మొదటి సమావేశాన్ని నిర్వహిస్తున్నందుకు నేను సంతోషిస్తున్నాను" అని కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు అన్నారు.

విమాన లీజింగ్ సుస్థిరమైన, వాణిజ్యపరంగా లాభదాయకమైన వ్యాపారమనీ, ఈ రంగంతో ముడిపడి ఉన్న నష్టాలను తగిన చట్టపరమైన, నియంత్రణ చర్యల ద్వారా క్రమంగా పరిష్కరిస్తున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. విమానయాన రంగానికి బ్యాంకు రుణాల కేటాయింపును పెంచే యంత్రాంగాలను అన్వేషించాలనీ... విమాన లీజింగ్‌లో సాంకేతిక, నైపుణ్యాల అభివృద్ధి కోసం జాయింట్ వెంచర్లను గుర్తించాలనీ ఆయన సూచించారు.

విమానాల లీజింగ్‌ను ప్రోత్సహించడానికి, లీజుకు ఇచ్చేవారి విశ్వాసాన్ని పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాల నిస్తున్నా యి. ఇందులో భాగంగా... 250 విమానాలు, 87 ఇంజిన్ లు సహా 422 అసెట్‌లను ఐఎఫ్ ఎస్‌సీ లీజుకు ఇవ్వగా, 474 లీజింగ్ ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. విమానాల లీజింగ్ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తూ... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత విమానయాన రంగం అనూహ్య వృద్ధిని సాధిస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు. భారత్ తన విమానాశ్రయ మౌలిక సదుపాయాలను వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ప్రతి 45 రోజులకో విమానాశ్రయం కార్యకలాపాలు ప్రారంభిస్తున్నప్పటికీ, విమానాల లభ్యత ఒక కీలకమైన అడ్డంకిగా మిగిలిపోయింది. భారతీయ విమానయాన సంస్థల విమానాల సముదాయంలో 85 శాతం కంటే ఎక్కువ లీజుకు తీసుకున్నవే. అందుకే ఈ లీజింగ్ వ్యవస్థ బలోపేతం కోసం భాగస్వాములతో నిరంతర సంప్రదింపుల ప్రాముఖ్యతనూ ఆయన స్పష్టం చేశారు.

విమానాల లీజింగ్, ఫైనాన్సింగ్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం లక్ష్యంగా... పన్నులు, నియంత్రణ విధానాలు, ఫైనాన్స్ లభ్యత, వ్యాపార నిర్వహణ సౌలభ్యం వంటి అనేక అంశాలను కమిటీ చర్చించింది. విమానాల కోసం రూపాయి-ఆధారిత ఫైనాన్సింగ్ అవకాశం, జీఏఏఆర్ వర్తింపుపై మరింత స్పష్టత, ఐర్లాండ్‌తో ద్వంద్వ పన్నుల నివారణ ఒప్పంద విధానాన్ని తిరిగి సమీక్షించేందుకు అవకాశం వంటి అంశాలు ఈ చర్చల్లో భాగంగా ఉన్నాయి. చర్చలను ముగిస్తూ... గుర్తించిన నియంత్రణపరమైన, ఆర్థికపరమైన, పన్నులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి సమన్వయంతో కూడిన, కాలపరిమితితో కూడిన విధానం అవసరమని శ్రీ రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. దేశంలో విమానాల లీజింగ్, ఫైనాన్సింగ్ కోసం అంచనా వేయదగిన విధాన ప్రణాళికను రూపొందించడంపై దృష్టి సారిస్తూ... సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు, భాగస్వాములతో సంప్రదించి ప్రతిపాదిత చర్యలను పరిశీలించడానికి కమిటీ అంగీకరించింది.

# వలిగొండలో గాయత్రీ హైస్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



నల్గొండ, సెప్టెంబర్ 4:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలోని గాయత్రీ హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గోవింద నామస్మరణతో ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించే పాటలు, నృత్యాలతో చిన్నారులు అలరించారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ శ్రావణ మాసం కృష్ణ పక్షం అష్టమి, రోహిణి నక్షత్రయుక్త రోజున శ్రీకృష్ణుడు కంసుడి చెరసాలలో దేవకీ, వసుదేవులకు జన్మించారని తెలిపారు. ఈ రోజును గోకులాష్టమిగా పిలుస్తారని, శ్రీకృష్ణుడి బాల్య లీలలను స్మరించుకుంటూ ఉట్టి కొట్టే వేడుకలను నిర్వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తావుటము నరహరి, పనుమటి మురళీధర్‌రెడ్డి, కొంతం బిక్షపతి, పాలకుర్ల వెంకటేశం గౌడ్, బిమిడి కవితతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో పని చేయాల్సిందిగా వాహన భాగాల పరిశ్రమకు

## వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పిలుపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:వాహన భాగాల పరిశ్రమ స్థానిక వాణిజ్య కార్యకలాపాలను అంతర్జాతీయ స్థాయికి చేర్చాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. మంత్రి ఆటోమోటివ్ కాంపొనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎమ్ఏ) 66వ వార్షిక కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించగా మంత్రి పాల్గొని సభను ఉద్దేశించి ప్రసంగించారు. అంతర్జాతీయ మార్కెట్లతో భారత్ తన అనుబంధాన్ని పెంపొందించుకోవాలని సంకల్పించుకున్న నేపథ్యంలో, వాహన భాగాల పరిశ్రమ తయారీ కార్యకలాపాలను అభివృద్ధి చెందిన దేశాలకు విస్తరించాలని, ఆటుపోట్లను తట్టుకొని నిలిచేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని, వేల్యూ చైన్‌లో ఎగువ స్థాయిలకు పురోగమించాలని మంత్రి సూచనలు చేశారు.

పరిశ్రమ అంతర్జాతీయ స్థాయి వాణిజ్యం దాదాపు 50 బిలియన్ అమెరికా డాలర్లకు చేరి, దిగుమతులు ఎగుమతుల మధ్య సమానంగా విభాజితమైందని శ్రీ గోయల్ వివరించారు. అంతర్జాతీయ స్థాయి ఆలోచనలను చేస్తే వాణిజ్యం పెంపొందుతుందని, దేశ ఆర్థిక పురోభివృద్ధిలో దిగుమతులు కూడా ఒక ముఖ్య పాత్రను పోషించగలుగుతాయని ఆయన అన్నారు. ఈ దృక్పథాన్ని.. దిగుమతులను పెంచుకోవాలంటూ అందుకు అందిస్తున్న ప్రోత్సాహంగా భావించవద్దని ఆయన స్పష్టంచేశారు.

దిగుమతులకు, ఎగుమతులకు మధ్య అంతరాన్ని విస్తరించాలని వాగ్దానం చేశారని, అయితే ఈ పని ఇంకా మొదలు కాలేదని మంత్రి అన్నారు. రాబోయే సంవత్సరాల్లో ఏసీఎమ్ఏ, దాని సభ్యుల పక్షాన పెద్ద స్థాయిలో అంతర్జాతీయ పెట్టుబడుల తో పాటు అంతర్జాతీయ వాణిజ్యాన్ని కూడా మరింత పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సహకార పూర్వక ప్రాజెక్టుల వల్ల గత కొన్ని సంవత్సరాల్లో ఈ పరిశ్రమ లాభపడిందని, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగలిగిన ధరలకు నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని సంపాదించుకొందని కేంద్ర మంత్రి అన్నారు.

పరిశ్రమ ఇక ప్రపంచం నలుమూలలా తయారీ కేంద్రాలను విస్తరించి, అభివృద్ధి చెందిన దేశాల్లో ఉనికిని చాటుకోవాలని ఆయన కోరారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో గత నాలుగైదు సంవత్సరాల్లో తొమ్మిది వాణిజ్య ఒప్పందాలు ఖరారైన నేపథ్యంలో భారత్‌కు మార్కెట్ల లభ్యత స్థాయులు విస్తరిస్తున్నాయని శ్రీ గోయల్ ప్రస్తావించారు. ఈ ఒప్పందాల్లో అభివృద్ధి చెందిన 38 దేశాలతో ఖాయమైన ఒప్పందాలు కలిసి ఉన్నాయని, వీటి మొత్తం జీడీపీ 60 ట్రిలియన్ అమెరికా డాలర్లని ఆయన వివరించారు. 2014 కంటే ముందు కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల మొత్తం జీడీపీ ప్రస్తుత విలువ ప్రకారం లెక్కించినప్పుడు 10 ట్రిలియన్ అమెరికా డాలర్లని, అదే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కిందటి నాలుగు సంవత్సరాల్లో సంతకాలైన ఒప్పందాల వల్ల 60 ట్రిలియన్ అమెరికా డాలర్ల జీడీపీ కలిగిన ఆర్థిక వ్యవస్థల వరకూ రెండు వైపులా మార్కెట్లు అందుబాటులోకి వచ్చి ప్రయోజనం కలుగుతుందని మంత్రి తెలిపారు.

ఈ ఒప్పందాల్లో.. ఎక్కువ జీడీపీ, ఎక్కువ తలసరి జీడీపీలను కలిగి ఉన్న సౌభాగ్యవంతమైన దేశాలతో కుదిరిన ఒప్పందాలు కూడా కలిసి ఉన్నాయని, వీటితో భారతీయ పరిశ్రమకు తక్కువ పోటీ, ఎక్కువ పూరకత్వం (కాంప్లిమెంటరిటీ) లభిస్తాయని మంత్రి అన్నారు. భారత్ పక్షాన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద సంప్రదింపులలో ఏసీఎమ్ఏ పాత్ర కూడా ఉందని శ్రీ గోయల్ అంగీకరించారు. ఈ సంస్థ ఎల్లవేళలా భారతీయ వాహన భాగాల రంగానికి జీరో డ్యూటీ లభ్యతను కోరుతూ వచ్చిందని, అలాగే భారతీయ మార్కెట్టు తలుపులను పరస్పర పద్ధతిలో తెరిచి ఉంచాలని సూచించిందని ఆయన అన్నారు. ఈ పరిశ్రమ ప్రపంచంలో అత్యుత్తమ కంపెనీలతో పోటీ పడగలుగుతుందని, అంతర్జాతీయ పోటీని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని మంత్రి అన్నారు.

"ధీరత్వానికి మించి, అస్థిరతను ఎదుర్కొంటూ కొత్త బాటలను వేయడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం" అనే ఇతివృత్తాన్ని కార్యక్రమానికి ఎంపిక చేయడం గురించి శ్రీ గోయల్ ప్రస్తావించారు. ఈ విషయం అనిశ్చితులు, సవాళ్లు, బాగా ఎక్కువ ఆటుపోట్లు కలుగుతున్న ప్రపంచంలో చాలా సందర్భశుద్ధితో కూడుకొందని ఆయన అన్నారు. ప్రపంచంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలోనూ భారత్ తన మార్గంలో దూసుకుపోతోందని, ప్రపంచంలో పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అన్నింటి కన్న వేగంగా కదులుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి అన్నారు. "విమర్శకులు తమకు తోచిన మాటలు మాట్లాడవచ్చు, అయితే 7.8 శాతం అభివృద్ధి రేటు మాత్రం వాస్తవం" అని ఆయన వ్యాఖ్యానించారు.

వివిధ రంగాల్లో వృద్ధిని గురించి శ్రీ గోయల్ చెబుతూ ఏసీఎమ్ఏ శర వేగంగా రెండు అంకెల రేటుతో పురోగమిస్తోందని, వాహన రంగం కూడా ఇలాగే పయనిస్తోందన్నారు. ఈ సంవత్సరంలో 50 లక్షల ప్యాసింజర్ కార్లు అమ్ముడవుతాయని భావిస్తున్నారని మంత్రి తెలిపారు. కార్లను నిల్వ చేయడం కాదు, కొనుగోలు చేస్తున్నారు సుమా అని ఆయన అన్నారు. విద్యుత్తుతో నడిచే కార్లను గురించి మాట్లాడుతూ, కొన్ని ఎలక్ట్రిక్ కార్ల కోసం ప్రస్తుతం ఆరు నెలల పాటు వేచి ఉండాల్సివస్తోందన్నారు.

ఉక్కు రంగం జోరు మీద ఉందని, భారత్ ఎంత ఉక్కును దిగుమతి చేసుకొంటోందో అంత కన్న ఎక్కువే ఎగుమతి చేస్తోందని, దేశీయంగా గిరాకీ చాలా అధికంగా ఉండడమే దీనికి కారణమనీ మంత్రి వివరించారు. ఈ గిరాకీని నెరవేర్చడంలో వాహన భాగాల పరిశ్రమ చెప్పుకోదగిన పాత్రను పోషిస్తోందని ఆయన అన్నారు. పరిశ్రమ సామర్థ్యాన్ని, సరఫరా వ్యవస్థ బలాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను గురించి శ్రీ గోయల్ ప్రస్తావించారు. వాహన భాగాల తయారీ పరిశ్రమకు పెద్ద ఎత్తున ఉత్పాదనలను అందించేటట్లు, స్పెషాలిటీ స్టీల్‌ను తయారు చేసే కంపెనీలకు అవసరపడే ఉక్కును భారత్‌లోనే ఉత్పత్తి చేసేటట్లు అందించిన మద్దతుకు నేరుగా ఇదే పరిశ్రమతో సంబంధం ఉందని ఆయన అన్నారు.

వాహన భాగాల పరిశ్రమలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ సంబంధిత పీఎల్ఐకు ఉన్న ప్రాధాన్యాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ పరిశ్రమకు టెక్నికల్ టెక్స్‌టైల్స్ అవసరమవుతుండడమే దీనికి కారణమన్నారు. దీంతోపాటు, సెమీకండక్టర్ పరిశ్రమకు మద్దతును అందించడంలో వాహన భాగాల సరఫరా వ్యవస్థను పటిష్ఠ పరచాలనే ఉద్దేశం ఇమిడి ఉందని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తోందని, 20 స్మార్ట్ నగరాలతో పాటు పారిశ్రామిక నగరాల పనులు పురోగమిస్తున్నాయని మంత్రి తెలిపారు.

# ఖాకీ దుస్తుల్లో మానవత్వం..

## చిన్నారికి రక్తదానం చేసిన కానిస్టేబుల్..!

కరీంనగర్, సెప్టెంబర్ 4మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గుర్రపు శశికుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. అత్యవసరంగా రక్తం అవసరమైన కోరుట్ల మండలం నాగులపేట గ్రామానికి చెందిన నాలుగు సంవత్సరాల ఓ చిన్నారికి రక్తదానం చేసి ప్రాణాపాయ సమయంలో అండగా నిలిచారు. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి రక్తదానం చేసిన శశికుమార్ సేవా స్ఫూర్తిని పోలీసు అధికారులు, పలువురు అభినందించారు. విధి నిర్వహణతో పాటు సామాజిక బాధ్యతను చాటుతూ ఖాకీ దుస్తుల్లోనూ మానవత్వం ఉంటుందని ఆయన నిరూపించారని కొనియాడారు.

# ఎన్‌వోసీ ప్రక్రియ సరళీకరణ, ఆటోమేషన్ చర్యల పురోగతిని

## సమీక్షించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:పౌర విమానయాన రంగంలో వ్యాపార నిర్వహణ సులభతరం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) చేసేందుకు తీసుకుంటున్న చర్యలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సమీక్షించారు. ముఖ్యంగా నిరభ్యంతర పత్రాల (ఎన్‌వోసీ) జారీ ప్రక్రియ సరళీకరణ, క్రమబద్ధీకరణ పురోగతిని సమీక్షించేందుకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో శ్రీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... ఎన్‌వోసీ జారీ ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా, పారదర్శకంగా, స్వయంచాలకంగా, కాలపరిమితితో కూడినదిగా, కనీస మానవ ప్రమేయం గలదిగా మెరుగుపరచాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. విమానయాన భద్రతకు సంబంధించిన నియంత్రణ అవసరాలు సక్రమంగా నెరవేరేలా చూడటం, సాధారణ ప్రజలు, సంఘాలు, బిల్డర్లు, పరిశ్రమల సభ్యులకు సౌకర్యాలను కల్పించడం ఈ ప్రతిపాదిత సంస్కరణల లక్ష్యం.

ముఖ్యంగా ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్ వంటి ప్రధాన మహానగరాల్లో, దరఖాస్తుదారులకు ప్రారంభ దశలోనే అనుమతించదగిన/గుర్తించిన భవన ఎత్తు వివరాలను అందించడంలో సాధ్యాసాధ్యాలనూ కేంద్ర మంత్రి చర్చించారు. దరఖాస్తుదారులు, ఇతర భాగస్వాములు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి, ప్రారంభం నుంచే వర్తించే ఎత్తు పరిమితులకు అనుగుణంగా తమ భవన నిర్మాణ ప్రణాళికను రూపొందించుకోవడానికి ఇటువంటి విధానం వీలు కల్పిస్తుంది.

ఈ సమావేశంలో ఏరోనాటికల్ స్టడీస్‌కు సంబంధించిన ప్రక్రియనూ చర్చించారు. ఆమోదాలను సరళీకృతం చేయడం, వేగవంతం చేయడంపై సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ముఖ్యంగా, ప్రారంభ దశలో సైట్‌లో భౌతిక ధ్రువీకరణ అవసరాన్ని తగ్గించడం... భవన అభివృద్ధి ప్రణాళికలు, ఇతర పత్రాలను సమర్పించాల్సిన అవసరాన్ని హేతుబద్ధీకరించడం వంటి అంశాలపై చర్చించారు.

నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అప్లికేషన్ సిస్టమ్ (ఎన్‌వోసీఏఎస్) ప్రస్తుత భౌగోళిక పరిధినీ సమీక్షించారు. ఎన్‌వోసీఏఎస్ ప్రస్తుతం వీఎఫ్ఆర్ (విజువల్ ఫ్లైట్ రూల్స్) కార్యకలాపాలకు 20 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలను, ఐఎఫ్ఆర్ (ఇన్‌స్ట్రుమెంట్ ఫ్లైట్ రూల్స్) కార్యకలాపాలకు 56 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలను కవర్ చేస్తోంది. సాధ్యమైన చోటల్లా పట్టణ స్థానిక సంస్థల స్థాయిలో ఎన్‌వోసీలను జారీ చేయడంలో సాధ్యాసాధ్యాలను ఈ సమావేశం పరిగణించింది. తద్వారా, ఎన్‌వోసీలను పొందడానికి వ్యక్తులు, పరిశ్రమలు నేరుగా ఏఏఐని సంప్రదించాల్సిన అవసరాన్ని తగ్గించవచ్చు. పైన పేర్కొన్న చర్యలు సహా... ఎన్‌వోసీ ప్రక్రియ సరళీకరణ, ఆటోమేషన్, వికేంద్రీకరణ విధివిధానాలను పరిశీలించి, విధానాలను రూపొందించాలని కేంద్ర మంత్రి ఆదేశించారు. 15 రోజుల కాలపరిమితిలోగా వాటి అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

విమానయాన భద్రతకు ఏ విధంగానూ భంగం కలగకుండా... సంబంధిత డేటా, అనుమతించదగిన ఎత్తు సమాచారాన్ని వెబ్‌సైట్‌తో సహా ప్రజలకు పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతిపాదనలకు వేగవంతమైన, కాలపరిమితితో కూడిన అనుమతిని అందించడమే ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

# గణపతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు..



కరీంనగర్, సెప్టెంబర్ 4 గణపతి నవరాత్రి ఉత్సవాలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అధికారులను ఆదేశించారు. బుధవారం గోదావరిఖని రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సింగరేణి, ఆర్ ఎఫ్ సి ఎల్, ఎన్ టి పి సి, పోలీస్ , విద్యుత్ శాఖ, రెవెన్యూ మున్సిపల్ శాఖ తోపాటు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయా శాఖలు చేపట్టాల్సిన పనులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శానిటేషన్, రోడ్లు, వీధి దీపాలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు తదితర అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

మండపాల వద్ద విద్యుత్ భద్రతపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. ఉత్సవాల మొదటి రోజు నుంచి నిమజ్జనం వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచించారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో పాటు వివిధ శాఖల అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో బ్రిక్స్ దేశాల ఐపీ కార్యాలయాల అధిపతుల 18వ సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:బ్రిక్స్ దేశాల మేధో సంపత్తి (ఐపీ) కార్యాలయాల అధిపతుల 18వ సమావేశంలో రెండో రోజు 2026, సెప్టెంబర్ 2న న్యూఢిల్లీలో జరిగింది. భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీకి చెందిన పేటెంట్లు, డిజైన్లు, ట్రేడ్ మార్కుల కంట్రోలర్ జనరల్ కార్యాలయం (సీజీపీడీటీఎం కార్యాలయం) ఆధ్వర్యంలో 2026 సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు మూడు రోజుల పాటు ఈ సమావేశం జరుగుతోంది. వర్చువల్, భౌతిక విధానాల్లో జరిగిన ఈ సమావేశంలో సుమారుగా 35 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. రష్యా, ఇరాన్, ఇథియోపియా ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా హాజరు కాగా, మిగిలిన సభ్యదేశాల అధికారులు నేరుగా సభకు హాజరయ్యారు. అంతర్జాతీయ ఆవిష్కరణకు, సృజనాత్మకతకు, ఆర్థిక అభివృద్ధికి కీలకంగా మారిన మేధో హక్కుల్లో బహుపాక్షిక సహకారాన్ని విస్తరించాలనే ఉమ్మడి నిబద్ధతను బ్రిక్స్ సభ్య దేశాల ఐపీ కార్యాలయాల అధిపతులు పునరుద్ఘాటించారు.

బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే ఇతివృత్తానికి అనుగుణంగా ఈ చర్చలు జరిగాయి. ఇవి సాంకేతిక స్థిరత్వాన్ని, సుస్థిరమైన ఆర్థిక వృద్ధిని ఐపీ నిబంధనలు ఎలా పెంపొందిస్తాయో స్పష్టం చేశాయి.

ఫలితాల ఆధారిత సహకారానికి మార్గనిర్దేశం చేయడానికి, సరిహద్దులను అధిగమించి ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, అంతర్జాతీయ ఐపీ ప్రమాణాలను రూపొందించడంలో ఉమ్మడి ప్రయత్నాలను బలోపేతం చేయడానికి మెరుగుపరిచిన కార్యాచరణ మార్గదర్శకాలను ఈ సమావేశం స్వీకరించింది. ఇది కొనసాగుతున్న ఐపీ బ్రిక్స్ చర్చల్లో సాధించిన ప్రధాన విజయం.

ఉమ్మడి సాంస్కృతిక, మేధో వారసత్వంలో భాగంగా ఉన్న సంప్రదాయ విజ్ఞానం, సంప్రదాయ వైద్య విధానాల ప్రాముఖ్యంతో పాటు వాటిని రక్షించి, పరిరక్షించాల్సిన ఆవశ్యకతను ఐపీ బ్రిక్స్ కార్యాలయాల అధిపతులు గుర్తించారు. ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి, జాప్యాలను తగ్గించడానికి, ఫలితాల ఆదాన ప్రదానాలను మెరుగుపరచడానికి బ్రిక్స్ దేశాల్లో పటిష్టమైన పేటెంట్ పరిశీలన సహకారంపై అధ్యయనం పరిధిలో సాధించిన పురోగతిని కూడా ఈ సమావేశం గుర్తించింది.

పేటెంట్ విశ్లేషణలు, ప్రాకృతిక అధ్యయనాల ద్వారా సాంకేతిక వృద్ధికి మద్దతు ఇవ్వడంలో ఐపీ బ్రిక్స్ కార్యాలయాల పాత్రను తెలియజేసింది. అలాగే బ్రిక్స్ దేశాల మార్కెట్లు అంతటా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, జీఐ ఉత్పత్తుల భద్రత, వాణిజ్యాన్ని బలోపేతం చేయడానికి పేటెంట్ విశ్లేషణలు, భౌగోళిక సూచిక (జీఐ)ల్లో కనుగొన్న విషయాలనూ ఈ సమావేశం గుర్తించింది. ఐపీ బ్రిక్స్ కూటమి ప్రాజెక్టులను సమర్థంగా అమలు చేయడానికి, సహకారాన్ని కొనసాగించడానికి సమన్వయ వ్యవస్థలు, క్రమబద్ధమైన ప్రగతి సమీక్షల ప్రాధాన్యాన్ని ఐపీ బ్రిక్స్ కార్యాలయాల అధిపతులు స్పష్టం చేశారు.

ఈ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించిన భారత ప్రభుత్వం వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పేటెంట్లు, డిజైన్లు, ట్రేడ్ మార్కుల కంట్రోలర్ జనరల్ కార్యాలయాన్ని ఐపీ బ్రిక్స్ కార్యాలయాల అధిపతులతో సహా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు ప్రశంసించారు. అంతర్జాతీయంగా విస్తరిస్తున్న భారతీయ ఐపీ ప్రభావాన్ని ప్రతిబింబిస్తూ... 2026లో భారత్ అధ్యక్షతన ఈ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వడం సీజీపీడీటీఎం కార్యాలయానికి గర్వకారణంగా నిలిచింది.

# ప్లాస్టిక్ నిర్మూలనకు బషీరాబాద్‌లో వినూత్న కార్యక్రమం



నిజామాబాద్, సెప్టెంబంర్ 4:కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు 1993?94 ఎస్ఎస్‌సీ బ్యాచ్ సభ్యులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామపంచాయతీకి తమ వంతు సహకారంగా 600 స్టీల్ ప్లేట్లు, 300 స్టీల్ గ్లాసులను శుక్రవారం అందజేశారు. ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలనే ఉద్దేశంతో ఈ సామగ్రిని అందించినట్లు తెలిపారు. కమ్మర్‌పల్లి ఎస్ఐ సీహెచ్. సతీష్ చేతుల మీదుగా స్టీల్ ప్లేట్లు, గ్లాసులను సర్పంచ్ బైకాని జమున మహేష్‌కు అందజేశారు.

గ్రామంలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులకు బదులుగా స్టీల్ సామగ్రిని వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు. సర్పంచ్ జమున మహేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. 1993?94 ఎస్ఎస్‌సీ బ్యాచ్ సభ్యులు గ్రామపంచాయతీకి 600 ప్లేట్లు, 300 గ్లాసులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. 'ప్లాస్టిక్ రహిత గ్రామం పరిశుభ్రమైన బషీరాబాద్' లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూమేశ్వర్, జీపీ కార్యదర్శి నవీన్‌గౌడ్, ఎస్ఎస్‌సీ బ్యాచ్ సభ్యులు ఏనుగు గంగారెడ్డి, బైకాని ముకేష్, శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షుడు పృద్వీ, కోశాధికారి ఆనంద్, వార్డు సభ్యులు రాజు, లావణ్య, రమేష్, లక్ష్మి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సామరస్యం, మానవుడు - ప్రకృతి సహజీవనం... పర్యావరణ సంరక్షణకు ఇవే పునాదులుగా ఉండాలి: శ్రీ భూపేందర్ యాదవ్

న్యూ ఢిల్లీ, సెప్టెంబంర్ 4:'పులుల ఆవాస ప్రాంతాలు: ఉపాధి, ఆదాయం ప్రాతిపదికలుగా - వాటి సంరక్షణ, బయో ఎకానమీ, పర్యావరణ హిత పర్యాటకం' అన్న అంశం ప్రధాన ఇతివృత్తంగా న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ఈ రోజు ప్రారంభించారు. 2026 సెప్టెంబర్ 2 - 3 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ సదస్సును.. అంతర్జాతీయ పెద్దపులి జాతుల (బిగ్ క్యాట్) కూటమి - ఐబీసీఏ, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (ఎన్టీసీఏ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ తన్మయ్ కుమార్, డీజీ (అటవీ), మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ సుశీల్ కుమార్ అవస్థి, ఐబీసీఏ డీజీ శ్రీ ఎస్.పి. యాదవ్, ఆసియా అభివృద్ధి బ్యాంకు భారత డైరెక్టర్ శ్రీమతి మియా ఒకా, మంత్రిత్వ శాఖ, ఐబీసీఏ, ఎన్‌టీసీఏ, ఏడీబీల చెందిన ఉన్నతాధికారులు, పులుల సంచార దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పులుల ఆవాస ప్రాంతాలను సహజ మూలధనంగా గుర్తించడం, వ్యవస్థాగత సేవల విలువను చాటడంతోపాటు - నిరంతర జీవనోపాధికి, స్థానికులకు ఆదాయాన్ని సమకూర్చడంలో, దీర్ఘకాలిక పర్యావరణ భద్రత వంటి అంశాలకు.. పులుల సంరక్షణ, బయో ఎకానమీ, పర్యావరణ హిత పర్యాటకం ఏ విధంగా చోదక శక్తిగా నిలుస్తాయెూ వివరించడంపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారిస్తాయి.

ప్రారంభోత్సవ సభనుద్దేశించి మాట్లాడుతూ.. 'ప్రాజెక్ట్ టైగర్' కింద భారత్ సాధించిన అద్భుత సంరక్షణా ప్రయాణాన్ని శ్రీ యాదవ్ వివరించారు. అడవులు, గడ్డి భూములు, నదులు, ఎరగా మారే జంతుజాతులు, వన్యప్రాణి కారిడార్లు, స్థానిక వర్గాల సంక్షేమం వంటి అనేక అంశాలతో... పులుల మనుగడ నేరుగా ముడిపడి ఉందన్నారు. నీటి భద్రత, కర్బన సంగ్రహణ, వాతావరణ నియంత్రణ, జీవవైవిధ్య సంరక్షణ, జీవనోపాధికి చేయూతనివ్వడం వంటి కీలకమైన పర్యావరణ సేవలతో... పులుల ఆవాస ప్రాంతాలు విలువైన ప్రాకృతిక మూలధనంగా నిలుస్తున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. నిర్దిష్ట జంతు జాతులు కేంద్రంగా సంరక్షణ చర్యలకు పరిమితం కాకుండా.. పర్యావరణ భద్రత, సామాజిక - ఆర్థిక అభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లేలా ఆవాస ప్రాంత నిర్వహణ దిశగా ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రకృతి ఆధార పరిష్కార మార్గాలు, కొత్త ఆర్థిక మార్గాలు, సామాజిక భాగస్వామ్యంతో పర్యావరణ హిత పర్యాటకం ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

"ప్రకృతితో సామరస్యం కలిగిన సంరక్షణ, మానవ-ప్రకృతి సహజీవనమే పర్యావరణ పరిరక్షణకు ప్రధాన ప్రాతిపదిక కావాలి" అని శ్రీ యాదవ్ వ్యాఖ్యానించారు. భూమిని కాపాడుకోవడమంటే నాణ్యమైన ఆహారాన్ని పరిరక్షించడమేనని, మానవ జాతి మనుగడకు ఇది అత్యావశ్యకమని అన్నారు. ఎడారుల పరిమాణం పెరగడం, నేలలో తేమ తగ్గిపోవడం, మృత్తికా నాణ్యత క్షీణించడం వంటి తీవ్రమైన సవాళ్లను ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటోందని మంత్రి తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రకృతి రక్షణతోపాటు... స్థానిక ప్రజల సంప్రదాయ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ, సుస్థిర సామాజిక-ఆర్థిక వికాసాన్ని సాధించడంలో పులుల ఆవాస ప్రాంతాల సంరక్షణ అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.

సంరక్షణ, బయో ఎకానమీ, పర్యావరణ హిత పర్యాటక రంగాలకు సంబంధించిన విధాన రూపకల్పనలో సాంప్రదాయక పరిజ్ఞానాన్ని క్రోడీకరించి, ఆయా విధానాల్లో పొందుపరచాల్సిన ఆవశ్యకతపై చర్చించాల్సిందిగా వర్క్‌షాప్ ప్రతినిధులకు మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. విజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, సామర్థ్య నిర్మాణం, స్థానిక ప్రజల సాంప్రదాయక విజ్ఞాన వినిమయం, విధాన రూపకల్పన తీరుతెన్నుల్లో చెప్పుకోదగ్గ మార్పులపై ఈ సదస్సు దృష్టి సారించాలని ఆయన కోరారు. పర్యావరణ సంరక్షణ విధానాల రూపకల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల స్థానిక సంప్రదాయ విజ్ఞానాన్ని ఒక్క వేదికపైకి చేర్చే దిశగా ఐబీసీఏ ముందడుగు వేయాలన్నారు.

అంతర్జాతీయ పెద్దపులి జాతుల (బిగ్ క్యాట్) కూటమి (ఐబీసీఏ) - ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ)లు.. ఈ కార్యక్రమం సందర్భంగా ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుని భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించుకున్నాయి. ఆవాస ప్రాంతాల సంరక్షణ, సుస్థిరాభివృద్ధి, సామర్థ్యాభివృద్ధి, పరస్పర సమాచార వినిమయం, ప్రకృతి సంరక్షణ కోసం నిధుల సమీకరణ కార్యకలాపాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకునే దిశగా ఈ ఒప్పందం ఒక కీలక ముందడుగు.

## భారత్ - ఆఫ్ఘనిస్థాన్ సంయుక్త వాణిజ్య కార్యవర్గబృందం వర్చువల్ సమావేశం... ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేసే చర్యలపై సమీక్ష

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: భారత్ - ఆఫ్ఘనిస్థాన్ వర్తక, వాణిజ్య, పెట్టుబడుల సంయుక్త కార్యవర్గ బృందం (జేడబ్ల్యూజీ) 2026 సెప్టెంబరు 1న వర్చువల్‌గా సమావేశాన్ని నిర్వహించింది. వాణిజ్యం, పరిశ్రమలు, సుంకాలు, నియంత్రణ సంస్థలు, దౌత్య కార్యాలయాల ప్రతినిధులతోపాటు... భారత్, ఆఫ్ఘనిస్థాన్‌లకు చెందిన అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సహకారానికి సంబంధించిన వివిధ అంశాలను ఇరుపక్షాలూ సమీక్షించాయి. వాణిజ్య సౌలభ్యాన్ని మరింత మెరుగుపరచడంతో పాటు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాయి.

వాణిజ్య సౌలభ్యం, సుంకాల విషయంలో సహకారం, ఆఫ్ఘన్ వ్యాపారులకు వీసా సౌలభ్యం, బ్యాంకింగ్, ఆర్థిక సహకారం, ఔషధ - వ్యవసాయ వాణిజ్యం, ఇంధన సహకారం, పెట్టుబడి - వాణిజ్య ప్రోత్సాహం, సుంకాల్లో రాయితీలు, సరుకు రవాణా అనుసంధానం, ఓడరేవు సంబంధిత అంశాలు సహా పలు కీలక అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు.

సంస్థాగత సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు, అలాగే మెరుగైన కస్టమ్స్ - డేటా వినిమయ సహకారం, ఔషధాలు - వ్యవసాయ రంగాల్లో నియంత్రణ పరమైన సహకారం, మెరుగైన వాణిజ్య అనుసంధానం, పెట్టుబడి వ్యాపార సంబంధాలను ప్రోత్సహించడం వంటి కీలక రంగాల్లో పురోగతి దిశగా చర్యలు చేపట్టేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి.

స్నేహపూర్వక, నిర్మాణాత్మక వాతావరణంలో ఈ సమావేశం జరిగింది. భారత్ - ఆఫ్ఘనిస్తాన్ వర్తక, వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నట్టు ఇరుపక్షాలు పునరుద్ఘాటించాయి. చర్చించిన అంశాలపై నిరంతర సంప్రదింపులను కొనసాగించడంపై అంగీకారానికి వచ్చాయి.

## డేటా సెంటర్ రంగం వేగవంతమైన విస్తరణకు సులభతర వ్యాపార విధానాలపై కేంద్రం దృష్టి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రపంచంలోనే భారత్ అత్యుత్తమ ప్రదేశమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో నేడు "భారత డేటా సెంటర్ వ్యవస్థ విస్తరణకు వ్యాపార సౌలభ్యం" అనే అంశంపై ఏర్పాటు చేసిన సీఈఓల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో డేటా సెంటర్ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు, వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించేందుకు పరిశ్రమకు చెందిన భాగస్వాములతో నిర్వహించిన ఈ చర్చలు ఎంతో ఉపయోగకరంగా, ఫలప్రదంగా సాగాయని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా అస్థిరత, అనిశ్చితి నెలకున్నప్పటికీ భారత్ ఆర్థిక వృద్ధి అవకాశాలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని శ్రీ గోయల్ అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిర్ణయాత్మక నాయకత్వాన్ని కేంద్రమంత్రి ప్రశంసించారు. ప్రతి భారతీయుడిలో 'అమృత్ కాల్', 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాల సాధనలో భాగస్వాములు అయ్యేలా విశ్వాసాన్ని నింపుతున్న శ్రీ మోదీకి, దేశ ప్రజలకి కేంద్ర మంత్రి అభినందనలు తెలిపారు.

డేటా సెంటర్, సెమీకండక్టర్ రంగాల సామర్థ్యం, కృత్రిమ మేధ రంగాల్లో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను, ప్రపంచ స్థాయి నాణ్యమైన ఉత్పత్తుల తయారీలో విస్తరిస్తున్న సామర్థ్యాన్ని శ్రీ పీయూష్ గోయల్ వివరించారు. రాబోయే సంవత్సరాల్లో ఈ రంగాలు భారత్ ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదక శక్తులుగా నిలిచి, 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగడానికి దోహదపడతాయని తెలిపారు. పరిశ్రమ ప్రతినిధులతో జరిగిన సమావేశం సానుకూల వాతావరణంలో సాగిందని, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన చర్చల ద్వారా ఇప్పటికే అనేక సమస్యలను పరిష్కరించగలిగామని శ్రీ గోయల్ అన్నారు. డేటా సెంటర్ రంగంలో దాదాపు 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండటంతో పరిశ్రమ విస్తరణకు సిద్ధంగా ఉండటం సంతోషకరమని పేర్కొన్నారు. భారత్‌ను ప్రపంచ డేటా సెంటర్ కేంద్రంగా ఎలా అభివృద్ధి చేయవచ్చనే అంశంపై సమావేశంలో విలువైన సూచనలు, ఆలోచనలు లభించాయని మంత్రి తెలిపారు.

భారత్‌లో డేటా సెంటర్ రంగాన్ని వేగంగా, సుస్థిరంగా విస్తరించేందుకు అనుకూలమైన వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో.. తొలిసారిగా నిర్వహించిన సీఈఓ రౌండ్‌టేబుల్‌కు కొనసాగింపుగా ఈ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. వ్యాపార సౌలభ్యం, డేటా సెంటర్ మౌలిక సదుపాయాల వేగవంతమైన ఏర్పాటుపై చర్చలు జరిగాయి. ముఖ్యంగా విద్యుత్, భూమి, నియంత్రణ, ఆర్థిక అంశాలపై దృష్టి సారించారు.

క్లౌడ్, కృత్రిమ మేధ ఆధారిత సేవల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డేటా సెంటర్లకు డిమాండు వేగంగా పెరుగుతోందని సమావేశంలో ప్రస్తావించారు. 2026 తొలి అర్ధభాగంలో డేటా సెంటర్ల వినియోగంలో 80 శాతానికి పైగా వాటా హైపర్‌స్కేలర్లదే కావడం, ఏఐ మౌలిక సదుపాయాల కేంద్రంగా భారత్ ఎదుగుతున్న విషయాన్ని స్పష్టం చేస్తోంది. వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, కృత్రిమ మేధ వ్యవస్థ ద్వారా ఏర్పడుతున్న అవకాశాల స్థాయిని ప్రతిబింబిస్తూ, డేటా సెంటర్ రంగంలో పెట్టుబడులు సుమారు 200 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకోవచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# జంగంపల్లిలో అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



నిజామాబాద్, సెప్టెంబంర్ 4: మండలంలోని జంగంపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. యాదవ సంఘం అధ్యక్షుడు గోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా కృష్ణ మందిరం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అవసరమైన వసతులు కల్పించారు. పండుగ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ హనుమాగౌడ్, గ్రామ సర్పంచ్ రాణి వాసుయాదవ్, యాదవ సంఘం సభ్యులు రమేష్, సిద్ధిరాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరు వేదికగా వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 8-12 తేదీల్లో 16వ ఏరో ఇండియా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:ఆసియాలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన, ప్రపంచంలోని ప్రముఖ ఏరోస్పేస్, రక్షణ ప్రదర్శనల్లో ఒకటైన ఏరో ఇండియా 16వ ఎడిషన్‌ను 2027 ఫిబ్రవరి 8 నుంచి 12 వరకు కర్ణాటకలోని బెంగళూరులో గల యలహంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో నిర్వహించనున్నారు. రక్షణ మంత్రిత్వ రక్షణ ఉత్పత్తి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం... ప్రపంచంలోని ప్రముఖ ఏరోస్పేస్, రక్షణ కంపెనీలు, విధాన రూపకర్తలు, సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తలు, పరిశ్రమ భాగస్వాములు, రక్షణ దళాల సిబ్బందిని ఒకే వేదికపైకి తీసుకువస్తుంది.

ఏరోస్పేస్, రక్షణ తయారీ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ఆవిష్కరణల్లో పెరుగుతున్న భారత్ సామర్థ్యాలను ప్రదర్శించే ఒక ప్రధాన అంతర్జాతీయ కార్యక్రమంగా ఏరో ఇండియా ఆవిర్భవించింది. ఇది వ్యాపార సంబంధాలు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, అంతర్జాతీయ సహకారం, వ్యూహాత్మక చర్చల కోసం ఒక చైతన్యవంతమైన వేదికను అందిస్తుంది. విస్తరిస్తున్న భారత రక్షణ రంగ పారిశ్రామిక వ్యవస్థను... ప్రపంచ ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో పెరుగుతున్న దాని పాత్రనూ ఇది ప్రముఖంగా చాటిచెబుతుంది.

అయిదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఒక సమగ్ర ప్రదర్శనతో పాటు పలు వ్యాపార, వ్యూహాత్మక కార్యక్రమాలు భాగంగా ఉంటాయి. ఇవి పరిశ్రమల మధ్య పరస్పర సంప్రదింపులకు, ప్రభుత్వాల మధ్య పరిశ్రమల అనుసంధానానికి, సాంకేతిక ప్రదర్శనలకు, సహకారాలకూ అవకాశాలను కల్పిసాయి. భారత వైమానిక దళం, ఇందులో పాల్గొనే అంతర్జాతీయ వైమానిక బృందాల అద్భుత వైమానిక ప్రదర్శనలూ ఉంటాయి. ఇవి సందర్శకులకు అధునాతన విమానయాన సామర్థ్యాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని అందిస్తాయి.

ఏరో ఇండియా-2027లో ప్రదర్శనకారులు, సందర్శకులు సజావుగా పాల్గొనడాన్ని సులభతరం చేయడానికి, వారికి సమగ్ర సేవలను అందించడానికి ఒక ప్రత్యేక వెబ్ ఆధారిత పోర్టల్‌ను అభివృద్ధి చేశారు. . ప్రదర్శనకారుల రిజిస్ట్రేషన్లు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

స్వయం-సమృద్ధ భారత్‌ను సాధించాలనే భారత దార్శనికత సాకారానికి... ప్రపంచ రక్షణ, ఏరోస్పేస్ రంగాల సరఫరా వ్యవస్థలో ఒక విశ్వసనీయ భాగస్వామిగా భారత్ ఆవిర్భావానికి ఈ ఏరో ఇండియా -2027 గణనీయ ప్రోత్సాహాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమం ఎంఎస్ఎంఈలు, అంకురసంస్థలు సహా భారత రక్షణ పరిశ్రమల భాగస్వామ్యాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు... భాగస్వామ్యాలు, పెట్టుబడులు, ఎగుమతులు, సాంకేతిక సహకారానికి మార్గం సుగమం చేస్తుంది.

# ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరంతర పోరాటం



నిజామాబాద్, సెప్టెంబంర్ 4: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని కాచాపూర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. 420 హామీలతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. యూరియా యాప్ కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపులో భాగంగా వారం రోజులపాటు ప్రభుత్వ వైఫల్యాలపై వివిధ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు అబ్బ బాలకిషన్, మాజీ ఉపసర్పంచ్ సాయాబుగారి సిద్ధాగౌడ్, గ్రామ మహిళా విభాగం అధ్యక్షురాలు ఆకుతోట భాగ్య, మాజీ వార్డు సభ్యుడు తోగరి మురళి, వీరేశ్వర ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మోతే బాపురెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఆకుతోట రాములు, కామినేని జీవన్‌రెడ్డి, మోతే మల్లారెడ్డి, దేవయ్య, సత్యం పాల్గొన్నారు.

# చిలుముల విఠల్‌రెడ్డి జయంతి సందర్భంగా ఘన నివాళులు

## ప్రజా సేవలను స్మరించుకున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

మెదక్, సెప్టెంబంర్ 4:స్వర్గీయ చిలుముల విఠల్‌రెడ్డి జయంతి సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు, గుమ్మడిదలలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి ప్రజలకు చేసిన సేవలను వారు స్మరించుకున్నారు. ప్రజలతో మమేకమై పనిచేస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన ముందుండేవారని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.

విఠల్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత సేవ చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పలువురు నాయకులు విఠల్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని, ప్రజల కోసం ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, రాంరెడ్డి, విమల, సీపీఐ మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, కుమ్మరి సత్తయ్య, సత్యనారాయణ, కరుణాకర్‌రెడ్డి, స్వేచ్ఛారెడ్డి, వెంకటేష్, వినోద్, రామకృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనుబంధ, ఆరోగ్య సంరక్షణ విద్య, వృత్తిపరమైన ప్రమాణాలు బలోపేతం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:దేశం కోసం నైపుణ్యం, సామర్థ్యం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండే ఆరోగ్య సంరక్షణ సిబ్బందిని తయారు చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అనుబంధ, ఆరోగ్య సంరక్షణ విద్య, శిక్షణ వృత్తిపరమైన ప్రమాణాలను బలోపేతం చేస్తోంది. ఈ దిశగా నేషనల్ కమిషన్ ఫర్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ (ఎన్సీఏహెచ్పీ) నియంత్రణ పరిధి కింద 33 నూతన, 21 పునర్నిర్మించిన/నవీకరించిన అనుబంధ, ఆరోగ్య సంరక్షణ సంబంధ అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) డిగ్రీలను విశ్వవిద్యాలయ నిధుల కమిషన్ నోటిఫై చేసింది.

యూజీసీ చట్టం-1956లోని సెక్షన్ 22(3) కింద డిగ్రీల నిర్దేశాలకు సంబంధించి 5వ సవరణను యూజీసీ జారీ చేసింది. ఎఫ్.21-12/2026 (సీపీపీ-ఎఎ) - (యూఐఎన్:3/2026) నంబరుతో 2026 ఆగస్టు 27న నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ 2026 ఆగస్టు 31న ప్రచురితమైంది. దేశవ్యాప్తంగా అనుబంధ ఆరోగ్య సంరక్షణ విద్యలో మరింత ఏకరూపతను తీసుకురావడంతో పాటు, ఆరోగ్య సంరక్షణ రంగంలోని ఈ కీలక విభాగాల్లో విద్యాపరమైన, వృత్తిపరమైన మార్గాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ నోటిఫికేషన్ ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుంది.

ఎన్సిఎహెచ్‌పి ఛైర్‌పర్సన్ డాక్టర్ యజ్ఞ ఉన్మేష్ శుక్లా మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, యూజీసీ, ఎన్సిఎహెచ్‌పి బృందాలు చేసిన కృషిని అభినందించారు. కమిషన్ నిర్దేశించిన 'ఒకే దేశం ఒకే పాఠ్యప్రణాళిక' విధానంలో భాగంగా, అనుబంధ, ఆరోగ్య సంరక్షణ కోర్సులు, వాటి వ్యవధి, డిగ్రీల పేర్లు, ప్రవేశ అర్హతల్లో ఈ యూజీసీ నోటిఫికేషన్ ఏకరూప పతను తీసుకువస్తుంది. ఎన్సీఏహెచ్‌పీ చట్టం, 2021 పరిధిలోని అనుబంధ, ఆరోగ్య సంరక్షణ వృత్తుల్లో తమ కెరీర్‌ను మలచుకోవాలనుకునే విద్యార్థులకు ఈ నోటిఫికేషన్ ఎంతగానో మార్గదర్శకంగా నిలుస్తుంది'' అని ఆయన అన్నారు.

నోటిఫై చేసిన డిగ్రీలలో ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఆప్టోమెట్రీ, మెడికల్ లాబొరేటరీ సైన్సెస్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నాలజీ, అనస్థీషియా - ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, న్యూట్రిషన్ - డైటెటిక్స్, సైకాలజీ, మెడికల్ - సోషల్ సైకియాట్రిక్ సోషల్ వర్క్, మెడికల్ రేడియాలజీ, ఇమేజింగ్ - థెరప్యూటిక్ టెక్నాలజీ, ఫిజిషియన్ అసోసియేట్, రెస్పిరేటరీ టెక్నాలజీ, డయాలసిస్ థెరపీ టెక్నాలజీ, హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఇతర రంగాలు ఉన్నాయి. ఈ నోటిఫికేషన్ డిగ్రీల నామకరణం, సంక్షిప్త నామాలు, కోర్సు వ్యవధి, ప్రవేశ అర్హతలను నిర్దిష్టంగా సూచించడమే కాకుండా, ఎంపిక చేసిన కొన్ని ప్రోగ్రామ్‌ల కాలపరిమితిని కూడా సవరించింది. ఈ నోటిఫికేషన్ నిర్దిష్ట రంగానికి చెందిన ప్రత్యేక (స్పెషలైజేషన్) డిగ్రీలను కూడా అందుబాటులోకి తెచ్చింది. ఇందులో మాస్టర్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీలో తొమ్మిది, మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీలో ఎనిమిది, మాస్టర్ ఆఫ్ మెడికల్ లాబొరేటరీ సైన్సెస్ లో నాలుగు, మాస్టర్ ఆఫ్ మెడికల్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీలో మూడు, మాస్టర్ ఆఫ్ రెస్పిరేటరీ టెక్నాలజీలో రెండు స్పెషలైజేషన్లు ఉన్నాయి. ఇది విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలను విస్తరించడమే కాకుండా, ఆరోగ్య సంరక్షణ రంగానికి ఎదురవుతున్న నూతన అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కోర్సులను అందించడానికి విశ్వవిద్యాలయాలకు వీలు కల్పిస్తుంది.

ఈ సంస్కరణ ద్వారా అనుబంధ, ఆరోగ్య సంరక్షణ విద్యలో సంస్థాగత సమానత్వాన్ని, దేశవ్యాప్తంగా ఏకరీతి ప్రమాణాలను నెలకొల్పడంతో పాటు, డిగ్రీల నామకరణాన్ని అంతర్జాతీయంగా ఆమోదించిన డిగ్రీ స్థాయి అర్హతలకు అనుగుణంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో మరింత మంది విద్యార్థులు ఈ వృత్తులను ఎంచుకునేలా ప్రోత్సాహం లభించడంతో పాటు, స్పష్టమైన విద్యా, వృత్తిపరమైన మార్గాలు ఏర్పడతాయని, భారతీయ అనుబంధ, ఆరోగ్య సంరక్షణ వృత్తి నిపుణులకు అంతర్జాతీయ స్థాయిలో మరింత వృత్తి చలనశీలత, గుర్తింపు లభించేందుకు దోహదపడుతుందని భావిస్తున్నారు.

ఈ కార్యక్రమం నేషనల్ కమిషన్ ఫర్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ యాక్ట్, 2021 కింద ఎన్సీఏహెచ్‌పీకి నిర్దేశించిన చట్టబద్ధ బాధ్యతను నెరవేరుస్తుంది. ఈ చట్టం అనుబంధ, ఆరోగ్య సంరక్షణ వృత్తులన్నింటిలో విద్యా ప్రమాణాలు, వృత్తిపరమైన సేవల ప్రమాణాలను నియంత్రించడం, నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ బాధ్యతకు అనుగుణంగా, దేశవ్యాప్తంగా పాఠ్యప్రణాళికలు, డిగ్రీల పేర్లలో ఏకరూపతను తీసుకురావడం లక్ష్యంగా ఎన్సీఏహెచ్‌పీ ఇప్పటికే 28 వృత్తులకు సంబంధించిన 18 సామర్థ్య ఆధారిత పాఠ్యప్రణాళికలను విడుదల చేసింది. సామర్థ్య ఆధారిత పాఠ్యప్రణాళికలు ఆసుపత్రులు లేదా అనుబంధంగా పనిచేస్తున్న ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో తగిన వ్యవధితో కూడిన ఇంటర్న్‌షిప్‌ల ద్వారా ప్రత్యక్ష క్లినికల్ శిక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నాయి. సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించేందుకు అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలు, వృత్తిపరమైన సామర్థ్యాలు, క్లినికల్ అనుభవాన్ని విద్యార్థులు పొందేలా ఈ విధానం దోహదపడుతుంది.

ఈ సంస్కరణలను అభ్యంతరం లేకుండా, సులభంగా అమలు పరిచేందుకు గాను 2026-27 విద్యా సంవత్సరం నుంచే ఈ నూతన పాఠ్యాంశాలను నిర్బంధంగా అమలు చేయాలని ఎన్సిఎహెచ్‌పి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇతర సంబంధిత భాగస్వామ్య వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. డిప్లొమా ఇన్ మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీ కోర్సును ప్రారంభించేందుకు ఐచ్ఛిక అవకాశం కూడా కల్పించింది. తదుపరి విద్యా సంవత్సరం నుంచి అమలు చేయడానికి మిగిలిన సామర్థ్య ఆధారిత పాఠ్యాంశాలకు కూడా తుది రూపునిచ్చే దిశగా కమిషన్ పనిచేస్తోంది. ఈ చర్యలు నైపుణ్యం, సరైన అర్హతలు కలిగిన అనుబంధ, ఆరోగ్య సంరక్షణ సిబ్బంది లభ్యతను మెరుగుపరుస్తాయని భావిస్తున్నారు. బహుళ విభాగాల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో వీరు అత్యంత కీలకమైన భాగం. ఈ సంస్కరణలు విద్యార్థులకు, విద్యా సంస్థలకు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలకు మరింత స్పష్టతను, స్థిరత్వాన్ని అందించడమే కాకుండా, వృత్తిపరమైన ఎదుగుదలకు, అంతర్జాతీయ అవకాశాలకు మెరుగైన ద్వారాలు తెరుస్తాయి.

# అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

**బ్రిడ్జిలోకి దూసుకెళ్లిన బైక్.. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం**

మెదక్, సెప్టెంబర్ 4:నిజాంపేట మండల పరిధిలోని నందిగామ బ్రిడ్జి వద్ద అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎంహెచ్29 ఏక్యూ6 433 నంబర్ గల బైక్‌పై ఇద్దరు వ్యక్తులు రామాయంపేట నుంచి నందిగామ వైపు వస్తుండగా అదుపుతప్పి బ్రిడ్జిలోకి దూసుకెళ్లింది. దీంతో తీవ్ర గాయాల పాలైన ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ ఆకుల స్వప్న రమేష్ ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుల వద్ద లభించిన ఆధార్ కార్డుల ఆధారంగా వారిని మహారాష్ట్రకు చెందిన వసంత్ రాథోడ్, గణేష్‌గా గుర్తించినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. మృతుల బంధువులు ఎవరైనా ఉంటే రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి లేదా నిజాంపేట పోలీసులను సంప్రదించాలని కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ అందించాలి

**అర్హులను గుర్తించి శిక్షణకు పంపాలి.. అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశం**




సంగారెడ్డి, సెప్టెంబంర్ 4:(నేటినిజం ప్రతినిధి): గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా వారి అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థతో సమన్వయం చేసుకుని శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

జిల్లాలో వివిధ నైపుణ్య శిక్షణలకు అర్హులైన యువతను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టాలని ప్రతీక్ జైన్ సూచించారు. గ్రామీణ యువతకు స్థానికంగా అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి మార్గాలను దృష్టిలో ఉంచుకుని శిక్షణ కోర్సులను ఎంపిక చేయాలని చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వార్షిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు.

వివిధ శాఖల పరిధిలోని అర్హులైన యువతను గుర్తించడంలో అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణ పొందిన అనంతరం యువతకు ఉపాధి లేదా స్వయం ఉపాధి అవకాశాలు లభించేలా అవసరమైన సహకారం అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యాలు ఉన్న యువతను గుర్తించి వారికి సరైన శిక్షణ అందించడం ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని అన్నారు.

ఈ సందర్భంగా ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో 18 నుంచి 50 ఏళ్ల వయసున్న వారికి సుమారు 70 రకాల కోర్సుల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల ద్వారా అర్హులైన అభ్యర్థులను గుర్తించి శిక్షణకు పంపితే మరింత మందికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

సమావేశంలో డీఆర్‌డీఓ పీడీ జ్యోతి, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, ఎల్‌డీఎం సుధీర్‌కుమార్, జిల్లా ఉపాధి అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి, ఏటీఓ కలీంబేగ్, పశుసంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి, డీఐసీ జనరల్ మేనేజర్ తుల్జానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు పాషా, విజయలక్ష్మి, ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఫ్యాకల్టీ నర్సింలుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే**



అమరావతి, సెప్టెంబర్ 3:మంచిని కాపాడేందుకు, చెడును అంతం చేసేందుకు శ్రీకృష్ణ పరమాత్ముడు అవతరించారని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని ప్రసాదంపాడు గ్రామంలో యాదవ్ యూత్, రామవరప్పాడు గ్రామంలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

ఈసందర్భంగా నిర్వాహకులు వివిధ రకాల పుష్పాలతో శ్రీకృష్ణుని విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ మహావిష్ణువు ఎనిమిదో అవతారమైన శ్రీకృష్ణావతారం ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిందన్నారు. అధర్మం పెరిగిన ప్రతిసారీ దైవం అవతరించి ధర్మాన్ని స్థాపిస్తుందనే సందేశాన్ని శ్రీకృష్ణుని జీవితం ప్రపంచానికి చాటిందని చెప్పారు. ప్రపంచానికి భగవద్గీతను బోధించి కర్తవ్యాన్ని, ప్రేమ తత్వాన్ని, ధర్మ మార్గాన్ని చూపిన మహనీయుడు శ్రీకృష్ణుడని కొనియాడారు.

ఎక్కడ శ్రీకృష్ణుని నామస్మరణ ఉంటుందో అక్కడ ఆనందం, శాంతి, సౌభాగ్యం నెలకొంటాయని, పిల్లల సందడితో ఆధ్యాత్మిక వాతావరణం కళకళలాడుతుందని పేర్కొన్నారు. శ్రీకృష్ణుని కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, యాదవ సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెడ్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి..

**రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి**

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబంర్ 4(నేటినిజం ప్రతినిధి): ఎన్నికల సమయంలో రెడ్లకు ఇచ్చిన న్యాయమైన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారం కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. చందుర్తి మండలం మర్రిగడ్డ రెడ్డి సంఘ భవనంలో చందుర్తి, రుద్రంగి మండలాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ నెల 8న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న రెడ్ల నిరసన దీక్ష పోస్టర్ ను ఆయన స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.వెయ్యి కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రెడ్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బుద్వేల్ లో కేటాయించిన 15 ఎకరాల భూమిని రెడ్డి హాస్టల్ కు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని విభాగాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తూ, రైతు బీమాను కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 8న ఇందిరా పార్క్ లో నిర్వహించనున్న రెడ్ల నిరసన దీక్షకు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ముస్కు తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నారెడ్ల రాఘవరెడ్డి, చందుర్తి మండల అధ్యక్షుడు బద్దం తిరుమల్ రెడ్డి, రుద్రంగి మండల అధ్యక్షుడు గంగం మహేష్ రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు పూడూరి జీవన్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌ను సందర్శించిన ఉత్తరాఖండ్ మీడియా బృందం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 4:ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) నిర్వహిస్తున్న హైదరాబాద్ ప్రెస్ టూర్‌లో భాగంగా, ఉత్తరాఖండ్‌కు చెందిన 15 మంది సభ్యుల మీడియా ప్రతినిధి బృందం ఈ రోజు హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఐసీఎంఆర్-ఎన్ఐఎన్)ను సందర్శించింది.

పోషకాహార పరిశోధన, ప్రజారోగ్య అవగాహన కోసం ఆ సంస్థ చేసిన మార్గదర్శక కృషి సహా... జాతీయ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన సమాచారం అందించడంలో దాని పాత్రను గురించి పాత్రికేయులకు ఈ పర్యటన ఆచరణాత్మక అవగాహన కలిగించింది.

ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి మాట్లాడుతూ... ఆహార కూర్పు, పోషక అవసరాలు, ఆహార మార్గదర్శకాలపై శాస్త్రీయ ఆధారాలను రూపొందించడంలో తమ సంస్థ ప్రధాన విధిని స్పష్టం చేశారు. దేశీయ ఆహార పదార్థాల్లోని శక్తి, ప్రోటీన్, సూక్ష్మ పోషకాలు, ఖనిజాల వివరాలను తెలియజేసే సమగ్ర పోషకాహార సమాచారాన్ని ఇండియన్ ఫుడ్ కంపోజిషన్ టేబుల్స్ (ఐఎఫ్‌సీటీ) అందిస్తాయన్నారు. ఈ పట్టికలు పరిశోధకులకు, ఆహార పరిశ్రమకు, ప్రజారోగ్య విధాన రూపకర్తలకు కీలకమైన రిఫరెన్స్ మెటీరియల్‌గా ఉపయోగపడతాయని డాక్టర్ భారతి వివరించారు.

భారత చట్టబద్ధమైన పోషకాహార కార్యక్రమాలకు పునాదిగా నిలుస్తూ... వివిధ శారీరక వర్గాలు, వయస్సుల వారిలో పోషకాహార ప్రాథమిక స్థాయిలను నిర్వచించే భారతీయుల పోషకాహార అవసరాలు-సిఫార్సు చేసే ఆహార భత్యాలు (ఆర్‌డీఏల) ప్రాముఖ్యతను డాక్టర్ కులకర్ణి ప్రముఖంగా ప్రస్తావించారు.

భారతీయుల కోసం ఆహార మార్గదర్శకాలు (డీజీఐ)×లోని కీలక సూత్రాలను ప్రస్తావిస్తూ... చిన్నతనం నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని డాక్టర్ కులకర్ణి సూచించారు. రెండు సంవత్సరాల్లోపు వయస్సు గల పిల్లలకు అదనపు చక్కెర అస్సలు ఇవ్వకూడదని సూచించే మార్గదర్శకాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు.

పోషకాహార లోపం వల్ల కలిగే రెండు రకాల దుష్ప్రభావాలను గురించి ప్రస్తావిస్తూ... నిశ్చల జీవనశైలితో పాటు కొవ్వు, చక్కెర, ఉప్పు అధికంగా ఉండే ఆహార పదార్థాలను (హెచ్ఎఫ్ఎస్ఎస్) మితిమీరి తీసుకోవడం వల్ల ముఖ్యంగా పిల్లల్లో అధిక బరువు, ఊబకాయం వంటి సమస్యలు అధికంగా పెరుగుతున్నాయని డాక్టర్ కులకర్ణి ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార భద్రత, పోషకాహార భద్రత మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని చూపుతూ... కేవలం ఆహారం అందుబాటులో ఉండటం మాత్రమే పోషకాహార శ్రేయస్సుకు హామీనివ్వదని ఆమె వ్యాఖ్యానించారు. ఆహార వైవిధ్యం, ప్రవర్తనా మార్పు అనేవి ప్రజారోగ్యానికి అనివార్యమైన స్తంభాలని ఆమె స్పష్టం చేశారు.

ఉత్తరాఖండ్‌కు చెందిన మండువా, ఝంగోరా, చోళై, కోడా వంటి దేశీయ పంటలు, చిరుధాన్యాల ద్వారా లభించే నిర్దిష్ట పోషక విలువల వివరాలను స్పష్టంగా అంచనా వేయడం కోసం వాటిపై పరిశోధనలు కొనసాగుతున్నాయని డాక్టర్ కులకర్ణి పేర్కొన్నారు. రక్తహీనత సమస్య తగ్గింపుపై రాగి (ఫింగర్ మిల్లెట్) వినియోగం ప్రభావాన్ని అంచనా వేసే వైద్యపరమైన, విశ్లేషణాత్మక అధ్యయనాలు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని ఆమె తెలిపారు.

ఐసీఎంఆర్-ఎన్ఐఎన్‌లోని పోషకాహార సమాచారం, కమ్యూనికేషన్-ఆరోగ్య విద్య (ఎన్ఐసీహెచ్ఈ) విభాగం అధిపతి, శాస్త్రవేత్త?జి డాక్టర్ సుబ్బారావు ఎం. గవరవరపు నిర్వహించిన సాంకేతిక సమావేశాలకూ మీడియా ప్రతినిధి బృందం హాజరైంది.

డాక్టర్ సుబ్బారావు సమకాలీన పోషకాహార వైరుధ్యం గురించి ప్రసంగిస్తూ... పోషకాహార లోపం, సూక్ష్మపోషకాల లోపాలు, జీవనశైలి ప్రేరిత జీవక్రియ రుగ్మతల మధ్య సంబంధాన్ని విశ్లేషించారు. శాస్త్రీయ పోషకాహార సమాచారానికి, ప్రజల రోజువారీ వినియోగ అలవాట్లకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడంలో మీడియా నిపుణుల కీలక పాత్రనూ ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఆహారపు తాత్కాలిక పోకడలను తొలగించి, ఆధారాల-ఆధారితమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించడానికి బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ చేయాలని ఆయన మీడియా ప్రతినిధులను కోరారు.

ఐసీఎంఆర్×ఎన్ఐఎన్‌లోని అధునాతన ప్రయోగశాల సదుపాయాలను జర్నలిస్టులు సందర్శించారు.

# కష్టకాలంలో కార్యకర్తలకు అండగా టీడీపీ



అమరావతి, సెప్టెంబర్ 3: కష్టకాలంలో కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన ముగ్గురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ సభ్యత్వ బీమా కింద మంజూరైన రూ.15 లక్షల చెక్కులను ఎమ్మెల్యే రాము శుక్రవారం గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో అందజేశారు.

వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన గుడ్లవల్లేరుకు చెందిన గుమ్మడి శ్రావణి, అంగులూరుకు చెందిన చింతా విజయలక్ష్మి, వడ్లమన్నాడుకు చెందిన కొనతం శ్రీరామమూర్తి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షల సభ్యత్వ బీమా చెక్కులను కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాము అందించారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబాల సభ్యులు మాట్లాడుతూ.. తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన సమయంలో ఆర్థికంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సభ్యత్వం ద్వారా లభించిన బీమా సాయం తమ కుటుంబాలకు ఎంతో భరోసానిచ్చిందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు.

పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు కష్టసమయంలో అండగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ లక్ష్యమన్నారు. ప్రమాదవశాత్తు కార్యకర్తలను కోల్పోయిన కుటుంబాలకు పార్టీ సభ్యత్వ బీమా ద్వారా ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని రాము తెలిపారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు అందుబాటులో అందుబాటులో ఉంటూ కష్ట కాలంలో నాయకత్వం వారికి అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, కార్యకర్తల కుటుంబాలను తమ కుటుంబాలుగా భావించి ఆదుకుంటామని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయ స్థాయి నుంచి గురువు స్థాయికి ఎదుగుదాం

**లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్, రచయిత**




హైదరాబాద్, సెప్టెంబంర్ 4:నేడు వివిధ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు తమ పరిమితులు దాటి విద్యార్థి పరిపూర్ణ వ్యక్తిత్వం కలిగిన బాధ్యత కలిగిన పౌరులుగా రూపొందించే బోధనలు చేసి గురువుల స్థాయికి ఎదగాలని ప్రముఖ రచయిత, వక్త లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు సెయింట్ జార్జి - పారడైజ్ న్యాల్స్ నేతృత్వంలో పెద్ద ఎత్తున నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉద్యోగిగా పాఠ్యాంశాలు బోధించి పిల్లల్ని పరీక్షలకు తయారు చేయడమనే విధులను ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పాఠ్య పుస్తకాల పరిధిని దాటి చదువుతో పాటు సంస్కారం నేర్పించుటలో గురువులుగా ముందుండాలని అన్నారు. చదువులు జీతం కోసం మాత్రమే కాదని, జీవితాన్ని సన్మార్గంలో నడవడానికి మన విద్య దోహదపడాలని సూచించారు. పాఠశాలల చైర్మన్ డాక్టర్ పి. ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో నిబద్ధతతో పని చేస్తున్న ఉపన్యాసకులు, ఉపాధ్యాయులను ఎంపిక చేసి సముచితంగా సన్మానించడం కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులు ప్రిన్సిపాల్ డా కల్వకుంట్ల రామకృష్ణ, ఉపన్యాసకులు డా బి వెంకటేశ్వర్లు, ప్రముఖ డాక్టర్ అనమల్ల శ్రీదేవిలు మాట్లాడుతూ కాలక్రమంలో ఉపాధ్యాయులకు కొత్త తొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమిస్తూ తమ వృత్తికి న్యాయం చేయాలని సూచించారు. ఇలాంటి విలక్షణమైన కార్యక్రమాలను చేపట్టి విజయవంతం చేస్తున్న ఫాతిమా రెడ్డిని అభినందించారు. అనంతరం వివిధ కళాశాలలు, పాఠశాలల ఉపన్యాసకులు, ఉపాధ్యాయులను అతిథులు ఘనంగా సత్కరించారు.

# సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయిత రెంటాల

రెంటాల గోపాలకృష్ణ ,( 5 సెప్టెంబర్ 1920 ?18 జూలై 1995) తెలుగు సాహిత్య భూమికపై తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయిత, పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, అనువాదకుడు, నాటకకర్తగా ఆయన సాహిత్య సేవ విస్తృత పరిధిని కలిగి ఉంది. భావ ప్రకటనను సామాజిక బాధ్యతగా స్వీకరించి, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయితగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది.

గుంటూరు జిల్లా రెంటాల గ్రామంలో 1920లో జన్మించిన గోపాలకృష్ణ, బాల్యంలోనే పఠనంపై ఆసక్తి కలిగి చరిత్ర, ఆర్థికశాస్త్రాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత పాత్రికేయ వృత్తిలోకి అడుగుపెట్టి, 'ఆంధ్రప్రభ' పత్రికలో ఉపసంపాదకుడిగా తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఆపై 'ఈనాడు' పత్రికలో కీలక పదవులు నిర్వహించారు. వార్తలను సామాజిక రాజకీయ విశ్లేషణతో సమన్వయం చేస్తూ, నూతన దృక్పథాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఆయన రాసిన సంపాదకీయాలు పాఠకుల ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి.

పత్రికా రచనను ప్రాణంలా భావించిన గోపాలకృష్ణ, మాతృభూమి, అభ్యుదయ, విజయప్రభ, ఆనందవాణి, ఆంధ్రజ్యోతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక, బాలజ్యోతి పిల్లల పత్రిక వంటి అనేక ప్రముఖ ముద్రిత మాధ్యమాల్లో రచనలు కొనసాగించారు. వార్తల వెనుకనున్న సంక్లిష్టతను విశ్లేషించి ప్రజలకు చేరువ చేసే శైలితో ఆయన పాత్రికేయత విలక్షణంగా నిలిచింది. ఆయన కలం మానవీయ విలువలకు ప్రతిబింబంగా మారింది.

సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ స్పష్టంగా ప్రతిఫలించేది.

అనువాద రంగంలో గోపాలకృష్ణ చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి, అభ్యుదయ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అనువాదాన్ని

**సెప్టెంబర్ 5...రెంటాల గోపాలకృష్ణ జయంతి**



ఆయన భాషాంతరం కాదని భావాంతరంగా చూసారు. భావ గంభీరతను, భాషా సామర్థ్యాన్ని సమన్వయించుతూ చేసిన ఆయన అనువాదాలు తెలుగులో విశిష్టమైన స్థానం సంపాదించాయి.

విమర్శా రచనలలో గోపాలకృష్ణ నిర్మాణాత్మక దృష్టితో, నిశితంగా, వాస్తవతను విశ్లేషించగల శైలితో నిలిచారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా సామాజిక అవసరాలను ప్రతిబింబించగల రచనలవైపు దృష్టిపెట్టి, సమకాలీన సాహిత్యంపై గంభీరంగా స్పందించారు. ఆయన విమర్శలు సాహిత్యాన్ని తన సామాజిక బాధ్యత గుర్తు చేసుకునేలా చేసేవి.

సంపాదకునిగా గోపాలకృష్ణ పాత్ర అసాధారణంగా నిలిచింది. అభ్యుదయ రచయితలకు ప్రోత్సాహం ఇచ్చి, వారి రచనలకు పత్రికల్లో చోటు కల్పించారు. నూతన రచయితలను తీర్చిదిద్దడంలో ఆయన నైపుణ్యం ప్రత్యేకమైనది. సంపాదకత్వాన్ని కేవలం పేజీల ఆవరణగా కాక, ప్రజా చైతన్య వేదికగా మలచిన వ్యక్తిగా ఆయన సాహిత్య చరిత్రలో గుర్తింపు పొందారు. సమకాలీన సమస్యలపై మౌలిక విమర్శను మేల్కొల్పే వ్యాసాల ద్వారా పాఠకులలో కొత్త దృక్పథాన్ని పెంపొందించారు.

రచయితగా గోపాలకృష్ణను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో ముఖ్యమైనవి.. పదజాలంలో స్పష్టత, భావ ప్రకటనలో లోతు, విమర్శలో నిజాయితీ, సంపాదకత్వంలో తాత్త్విక నిబద్ధత. రచనను వృత్తిగా కాక, బాధ్యతగా పరిగణించి, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన ఉదాహరణగా ఆయన నిలిచారు.

రెంటాల గోపాలకృష్ణ రచనలు నేటికీ సమకాలీ కలిగి ఉన్నాయి. సామాజిక సమస్యలను కేంద్రంగా ఉంచుకుని, మార్పుకు మార్గనిర్దేశం చేసే శక్తిని వాటిలో నిక్షిప్తం చేశారు. ఆయన జీవితమే ఒక ఉద్యమం, రచనలే ఒక సందేశం. భావసాంద్రతతో కూడిన ఆయన రచనలు పాఠకులను కలచి వేస్తాయేమో కానీ, తేలికగా వదిలిపెట్టవు. ఆయన కలం ప్రశ్నించేది.. సమాజాన్ని, చట్టాలను, మనవాణ్ని. ఆయన రచనలను చదవడం ద్వారా మనం మనల్ని మళ్ళీ ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.

రెంటాల గోపాలకృష్ణ ఒక రచయిత మాత్రమే కాదు.. ఒక అభ్యుదయ దృక్కోణం. సాహిత్యాన్ని మార్పు కోసం, కోసం, సమాజపు అణగారిన గొంతుకలకు మద్దతుగా వినిపించిన ఆత్మగాథగా ఆయన రచనలు నిలిచి పోయాయి. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక శాశ్వత శిఖరం. ఆయన రచనలను మనం గౌరవించాలి కాదు.. అనుసరించాలి. ఎందుకంటే ఆయన కలం భావాలకు మార్గాన్ని చూపినది, సమాజానికి దిక్సూచి అయినది.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## కాంగ్రెస్ అరాచకాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది..

### ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు: బిజెపి మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్"



కరీంనగర్, సెప్టెంబంర్ 4 (నేటినిజం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంపై, మహనీయుడు సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్లరంగు చల్లి అవమానించడాన్ని నిరసిస్తూ, అలాగే నల్గొండ జిల్లాలో బీజేపీ క్యాంపు కార్యాలయం మరియు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై జరిగిన దాడిని ఖండిస్తూ కేశవపట్నం మండల కేంద్రంలో బీజేపీ ఎస్సీ మోర్చా మండల శాఖ అధ్యక్షులు కనకం కుమారస్వామి మండల శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ నిరసన కార్యక్రమానికి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయడం, సంత్ రవిదాస్ చిత్రపటాన్ని అవమానించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన ఖండించారు.

అలాగే నల్గొండ జిల్లాలో బీజేపీ క్యాంపు కార్యాలయంపై, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి విధ్వంసం సృష్టించడం దారుణమని అన్నారు. ఈ దాడిలో ఆయన తల్లి గాయపడటం అత్యంత అమానుషమని, మహిళల పట్ల కూడా కనీస గౌరవం లేకుండా కాంగ్రెస్ శ్రేణులు వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఏనుగుల అనిల్× మాట్లాడుతూ, "ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి మా హెచ్చరిక. భారతీయ జనతా పార్టీ సహనాన్ని చేతకానితనంగా భావించవద్దు. హద్దుల్లో ఉండండి. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇప్పటికే గమనిస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ, ప్రతిపక్షాలపై దాడులు చేయడం మానుకోవాలి. భారతీయ జనతా పార్టీ ఉద్యమించాలని నిర్ణయించుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా మనుగడ ఉండదు. ప్రజల సమస్యలను పరిష్కరించి సుపరిపాలన అందించడంపై దృష్టి పెట్టాలి. అరాచకాలు, గూండాయిజం, ప్రతీకార రాజకీయాలకు స్వస్తి చెప్పాలి'' అని హెచ్చరించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ మరింత ఉద్ధృతంగా పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొమురయ్య , మాజీ ఎంపీపీ దొంగల రాములు,జిల్లా కౌన్సిల్ మెంబర్ దాసరపు నరేందర్, బిజెపి సర్పంచ్లు వెన్నం మల్లేశం కొయ్యడ కుమార్ యాదవ్, ఉప సర్పంచ్ జంగ జైపాల్, కొయ్యడ అశోక్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మచెట్టు సంపత్ రావు,మండల ఉపాధ్యక్షులు ఎలుక పెల్లి సంపత్ , రాసమల్ల శ్రీనివాస్ , కార్యదర్శి గౌరవేణి శ్రీనివాస్ , బిజిలి సారయ్య, బోడ తిరుపతిరెడ్డి,మహిళ మోర్చాఅధ్యక్షురాలు చర్ల అనిత యువ మోర్చా మండల అధ్యక్షుడు బొజ్జ సాయి ప్రకాష్ బిజెపి సీనియర్ నాయకులు పలకల రాజిరెడ్డి, మందాడి జగ్గారెడ్డి, రాజిరెడ్డి.జాన పట్ల రాజిరెడ్డి దాసరి సంపత్,చర్ల శ్రీనివాస్ , శివారెడ్డి, వీరా అర్జున్, రంజిత్ శ్రీనాథ్ ,కుమార్ , వికాస్, సాయి, మైపాల్ ,బీజేపీ మండల నాయకులు, ఎస్సీ మోర్చా నాయకులు, శక్తికేంద్ర ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భార్యాభర్తల గొడవను నివారించేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

ములుగు, సెప్టెంబంర్ 4:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో కత్తిపోటు ఘటన కలకలం రేపింది. భార్యాభర్తల మధ్య గొడవకు సంబంధించి వచ్చిన డయల్-112 కాల్‌కు స్పందించి అక్కడికి వెళ్లిన బ్లూకోట్స్ కానిస్టేబుల్‌పై ఓ యువకుడు కత్తితో దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. అనంతరం ఇనుప రాడ్లతోనూ దాడి చేసినట్లు సమాచారం.

వివరాల్లోకి వెళ్తే.. గురువారం రాత్రి తొర్రూరు పట్టణంలోని గంగోత్రి వాటర్ ప్లాంట్ ఎదురుగా భార్యాభర్తలు గొడవ పడుతున్నారంటూ మహిళ డయల్-112కు సమాచారం అందించింది. దీంతో తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోట్స్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జాటోత్ రామచంద్ర రాత్రి సుమారు 11.20 గంటలకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

అక్కడ పరిస్థితిని తెలుసుకునే క్రమంలో దంతాలపల్లి మండలం ఆగపేట తూర్పు తండాకు చెందిన గూగుల్ కోటేశ్వర్ ఒక్కసారిగా కత్తితో కానిస్టేబుల్ రామచంద్రపై దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఎడమ చేతి కింద, గుండె సమీపంలో కత్తిపోటు తగిలి గాయమైంది. అంతటితో ఆగకుండా నిందితుడు రెండు ఇనుప రాడ్లతో కూడా దాడి చేసినట్లు సమాచారం.

వెంటనే రామచంద్ర మరో పోలీస్ సిబ్బందికి సమాచారం అందించగా, పెట్రోలింగ్ వాహనంలో ఆయనను దవాఖానకు తరలించారు.

వైద్యులు చికిత్స అందించి సుమారు ఆరు కుట్లు వేసినట్లు సమాచారం. ప్రస్తుతం కానిస్టేబుల్ రామచంద్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా, ఘటనకు పాల్పడిన కోటేశ్వర్‌ను పోలీసులు రాత్రికి రాత్రే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## జుక్కల్ వద్ద అదుపుతప్పి బస్సు బోల్తా.. డ్రైవర్ అక్కడికక్కడే మృతి

### జాతీయ రహదారి 161పై ఘటన
### 15 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు

కామారెడ్డి, సెప్టెంబంర్ 4::(నేటినిజం ప్రతినిధి): జాతీయ రహదారి 161పై బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన జుక్కల్ చౌరస్తా సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం



ప్రకారం.. హైదరాబాద్ నుంచి బిచ్కుందకు ప్రయాణికులతో వెళ్తున్న బస్సు జుక్కల్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి 161పైకి చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది.

ప్రమాద తీవ్రతతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే వారిని బయటకు తీసి పోలీసులకు సమాచారమందించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ విట్టల్ రెడ్డి, సీఐ రవికుమార్, ఎస్సై మురళి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు.

మృతదేహాన్ని బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన 15 మంది ప్రయాణికులను చికిత్స నిమిత్తం బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

### –ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ధ్వజ
### –కరీంనగర్‌లో బీఆర్ఎస్ వంటా వార్పు

కరీంనగర్, సెప్టెంబంర్ 4 (నేటినిజం ప్రతినిధి) మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పిలుపుతో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట 'వంటా వార్పు' నిర్వహించారు.

మహిళలు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు విస్మరించిందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారని, ఆ హామీలను అమలు చేయలేదన్నారు.

హామీల అమలుకు మహిళల పక్షాన పోరాటం కొనసాగిస్తామని, అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.

మరో 825 రోజులే..మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనకు వెయ్యి రోజులు పూర్తయ్యాయని, మరో 825 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ మంత్రివర్గం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. కొండా సురేఖ రూపంలో తొలి వికెట్ పడిందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగుతుందన్న నమ్మకం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజురోజుకూ ప్రభుత్వాన్ని నడిపించే శక్తిని కోల్పోతున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ పోరాటాలకు ప్రజల నుంచి స్పందన లభిస్తోందని, రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, సుధగోని మాధవి, గాదె రూప, యూసుఫ్, అలీ, జమ్ము, రూరల్ అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## మత్స్య పారిశ్రామిక సంఘం అభివృద్ధికి కృషి చేయాలి: మంత్రి సీతక్క

### చైర్మన్ మోపిదేవి వెంకటేశ్వర్‌రావు, పాలకవర్గ సభ్యులకు ఘన సన్మానం



ములుగు సెప్టెంబంర్ 4:(నేటినిజం ప్రతినిధి): ములుగు: గత మూడు నెలల క్రితం చల్వాయి ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సంఘం లిమిటెడ్ చైర్మన్‌గా ఎంపికైన మోపిదేవి వెంకటేశ్వర్‌రావు ని, సంఘం పాలకవర్గ సభ్యులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఘనంగా సన్మానించారు.

గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులతో సమావేశమై సంఘం కార్యకలాపాలు, సభ్యుల సంక్షేమం, మత్స్యకారుల అభివృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు.

మత్స్యకార కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి సంఘాలు కీలకంగా పనిచేయాలని, సభ్యుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి, మత్స్యకారులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పాలకవర్గ సభ్యులను కోరారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మోపిదేవి వెంకటేశ్వర్‌రావుకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు చింత క్రాంతి, యువజన నాయకులు గొంది కిరణ్, కాడబోయిన రవి, వాసం శ్రావణ్, ఉపాధ్యక్షులు ఈర్ల నరసింహస్వామి, కార్యదర్శి నిమ్మల భాస్కర్, డైరెక్టర్లు దారం రాజు, కుక్కల సమ్మయ్య, పుప్పాల కిరణ్‌కుమార్, బోయిని అయిలయ్య, రేగుల నాగరాజు, మోపిదేవి సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం పోరాటం

### -బీఆర్ఎస్ నేత చెల్మెడ నరసింహారావు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబంర్ 4(నేటినిజం ప్రతినిధి): వృద్ధులు, వికలాంగులు, మహిళల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వృద్ధులు, వికలాంగులు, మహిళా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చార్వాక వృద్ధుల ఫౌండేషన్‌కు సంబంధించిన స్థలాన్ని రేవంత్ ప్రభుత్వం లాక్కునేందుకు ప్రయత్నిస్తున్న తీరును ఫౌండేషన్ సభ్యులు చల్మెడ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే దళితులకు సంబంధించిన భూములను కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సదస్సులో ఫౌండేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

వృద్ధులు, వికలాంగులు, మహిళలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలు, హక్కులు సక్రమంగా అందేలా పోరాడుతామని చల్మెడ హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ నిరంతరం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో చల్మెడ లక్ష్మీనరసింహారావును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని పలువురు నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఫౌండేషన్ సభ్యులు, వృద్ధులు, వికలాంగులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.